www.prajamantalu.com

సంపుటి : 5
సంచిక : 08
పేజీలు : 8
వెల : రూ. 4

# ప్రజా మంటలు

Prajamantalu Jagtial

మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

ఎడిటర్ : సిహెచ్.వి ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

శుక్రవారం 08 మార్చి 2024







## ఎమ్మెల్సీల నియామకం చెల్లదు

వార్త 2లో

- ఎమ్మెల్సీలను నియమించే అధికారం కేబినేట్‌దే
- అభ్యంతరాలు ఉంటే తిప్పి పంపాలే తప్ప
- కోదండరామ్, అమీర్ అలీఖాన్‌ల నియామకం చెల్లదు
- గవర్నర్ నిర్ణయాన్ని తప్పపట్టిన హైకోర్టు

## పాతబస్తీ మెట్రోకు నేడు శంకుస్థాపన

సిఎం రాకతో భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

వార్త 2లో

## చదువుమీద పెట్టేది

# ఖర్చు కాదు.. పెట్టుబడి

- అట్టడుగు వర్గాల అభ్యున్నతికి మా ప్రభుత్వం కృషి
- దళితులు, గిరిజనులు, బీసీ మైనార్టీలందరికీ ఒకేచోట ఇండ్లు
- ఇందిరమ్మ ఇండ్లు కేటాయించేలా చర్యలు
- ప్రతీ నియోజకవర్గంలో ఒకే క్యాంపస్ లో గురుకులాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్ ప్రారంభోత్సవం

**హైదరాబాద్, మార్చి 7 (ప్రజా మంటలు):** డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఎన్నో సంస్కరణలకు కృషి చేశారన్నారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన గాంధీ కుటుంబంతో, కాంగ్రెస్ పార్టీతో కొనసాగారని ఆయన వ్యాఖ్యానించారు. జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి మా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో రెసిడెన్షియల్ స్కూల్స్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు విడి విడిగా ఉండేవని, దళితులు, గిరిజనులు, బీసీ మైనార్టీలందరికీ మిగతా 2లో..

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

డీఏ 50 శాతానికి పెంపు



వార్త 2లో

## దూకుడు పెంచిన కాంగ్రెస్

యువతకు 5 ఎన్నికల హామీలు ప్రకటించిన రాహుల్



**జైపూర్, మార్చి 7 (ప్రజా మంటలు):** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో కాంగ్రెస్ దూకుడు పెంచింది. దేశవ్యాప్తంగా యువతను ఆకట్టుకునే హామీలను ప్రకటిస్తోంది. కాంగ్రెస్ పార్టీ లీడర్ రాహుల్ గాంధీ గురువారం యువతకు 5 ఎన్నికల హామీలు ప్రకటించారు. రాజస్థాన్ లో బన్స్వారాలో సాగుతున్న భారత్ జోడో యాత్రలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తో కలిసి యువతపై హామీల ఝల్లు కురిపించారు. దేశవ్యాప్తంగా మొత్తం 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు మేం గుర్తించాం.. పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే.. మొదటి హామీగా ఉద్యోగాల భర్తీపైనే సంతకం ఉంటుందని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీ వర్గాలతో 90 శాతం ఉద్యోగాలను నింపుతామని ప్రకటించారు. రెండో హామీగా ..రైట్ టు అప్రెంటిషిప్..గతంలో కాంగ్రెస్ హయాంలో ఉపాధి హక్కుగా ఉపాధి హామీ పథకం తెచ్చాం..అదే తరహాలో మిగతా 2లో..

## బిజెపి తీర్థం పుచ్చుకున్న కె.కరుణాకరన్ కుమార్తె

జవదేకర్ సమక్షంలో పార్టీలో చేరిక



**న్యూఢిల్లీ,మార్చి7 (ప్రజా మంటలు):** సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేరళలో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ ముఖ్య నాయకురాలు పద్మజా వేణుగోపాల్ భాజపాలో చేరారు. ఈమె కాంగ్రెస్ దివంగత నేత, మాజీ సీఎం కె.కరుణాకరన్ కుమార్తె. దిల్లీలో కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జావడేకర్ సమక్షంలో పద్మజా వేణుగోపాల్ భాజపా తీర్థం పుచ్చుకొని కాషాయ కండువాను కప్పుకొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో త్రిసూర్ నుంచి పోటీచేసి ఓటమిపాలైన ఆమె.. కాంగ్రెస్ పార్టీ తనను పక్కన పెట్టిందన్న అసంతృప్తి నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు, పద్మజా వేణుగోపాల్ భాజపాలో చేరతారంటూ ఊహాగానాలు చెలరేగగా.. అవన్నీ జోక్ అంటూ ఇటీవలే మిగతా 2లో..

## వందరోజుల్లోనే ఎలివేటెడ్ కారిడార్‌కు మోక్షం

కాంగ్రెస్ వంద రోజుల్లోనే సాధించింది

మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**హైదరాబాద్, మార్చి 7 (ప్రజా మంటలు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ వంద రోజుల్లోనే రాజీవ్ రహదారి ఎలివేటెడ్ ఎలివేటర్ కారిడార్‌కి మోక్షం లభించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ... ఆల్వాల్ ప్రాంతం నుంచి కరీంనగర్, ఆదిలాబాద్ వైపు వెళ్లే వాహనాలకు లక్షలాది ప్రజలకు సౌకర్యవంతంగా ఉండటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కారిడార్‌కి గురువారం శంకుస్థాపన చేశారని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు వారి గమ్యస్థానం నుంచి ఇక్కడికి రావడం ఒక ఎత్తయితే.. ఇక్కడి నుంచి సిటీలోకి వెళ్లడానికి అంతే సమయం పట్టే పరిస్థితి ఉండేదని చెప్పారు. ఈ రోడ్డు గత 30 - 40 సంవత్సరాలుగామిలట్రీ కంటోన్మెంట్, ప్రభుత్వానికి మధ్య ఈ రోడ్డు నలుగుతున్నదని చెప్పారు. మిలటరీ ల్యాండ్స్‌ను కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లియర్ చేశారని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఈ రోడ్డుకు మిగతా 2లో..

## ఉక్రెయిన్‌పై క్షిపణిదాడి

తృటిలో తప్పించుకున్న ఇరు దేశాధినేతలు



వార్త 2లో



## మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం

**హైదరాబాద్, మార్చి 7 (ప్రజా మంటలు):** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడు బ్యారేజీలను పరిశీలించేందుకు వచ్చిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల బృందం రంగంలోకి దిగింది. బుధవారం మిగతా 2లో..


## గ్యాస్ సిలిండర్లకు రాయితీ గడువు పొడిగింపు

కేంద్రమంత్రి పీయూష్ గోయల్



వార్త 2లో

## ప్రజా నాడి




## వర్షపాతంపై సిఎం రేవంత్ తప్పుడు సమాచారం

గతేడాది 14శాతం అత్యధిక వర్షపాతం - లోటు వర్షపాతం పేరుతో అబద్దాలు: కేటిఆర్


### లిక్కర్ కేసు పెద్దదేమీ కాదు

దాన్ని మా లీగల్ టీమ్ చూసుకుంటుంది

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ధీమా



**హైదరాబాద్, మార్చి 7 (ప్రజా మంటలు):** లిక్కర్ కేసు పెద్ద కేసు కాదని ఎమ్మెల్సీ కవిత అభిప్రాయం వ్యక్తం చేశారు. మిగతా 2లో..



**హైదరాబాద్, మార్చి 7 (ప్రజా మంటలు):** తెలంగాణలో వర్షపాతం నమోదుపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షపాతంపై ముఖ్యమంత్రివి అబద్దాలని చెప్పారు. భారత వాతావరణ శాఖ లెక్కల ప్రకారం 2023-24 సంవత్సరానికి సాధారణం కంటే 14 శాతం ఎక్కువ వర్షపాతం రాష్ట్రంలో నమోదైందని తెలిపారు. నీటి సమస్యలు తీర్చే సామర్థ్యం లేక.. లోటు వర్షపాతమంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అబద్దా లు, మిగతా 2లో..

## ధరణి సమస్యలకు ప్రత్యేక ప్రాధాన్యత

స్పెషల్ డ్రైవ్ ద్వారా పరిష్కారానికి కృషి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



**హైదరాబాద్, మార్చి 7 (ప్రజా మంటలు):** 'ధరణి' సమస్యలు పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ఎంతో హడావిడిగా ఎలాంటి అధ్యయనం చేయకుండా ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిందని ఆక్షేపించారు. 2,46,536 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. వాటి పరిష్కారం కోసం ఈ నెల 1 నుంచి తహసీల్దార్ స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ స్థాయిలో 76,382 దరఖాస్తులు పరిష్కరించినట్లు వెల్లడించారు. ఈ మేరకు మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు.రోజుకు 15 వేలకు పైగా దరఖాస్తులు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా పెండింగ్ మ్యూటేషన్ సంబంధించి 15,070 దరఖాస్తుల్లో 5,471 వరకు పరిష్కరించామని వివరించారు. కోర్టు కేసులకు సంబంధించి 27,672 దరఖాస్తుల్లో 9,883 వరకు పరిష్కరించామన్నారు. ఇప్పటివరకు జరిగిన స్పెషల్ డ్రైవ్ ప్రక్రియలో రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేసి సమస్యలను పరిష్కరించడం పట్ల మంత్రి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లోనూ ఇదే స్ఫూర్తి కొనసాగించాలని ఆకాంక్షించారు.

మొదటి పేజీ తరువాయి

# 'చదువుమీద పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి..



ఒకేచోట ఇందిరమ్మ ఇండ్లు కేటాయించేలా అధికారులను ఆదేశించామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రతీ నియోజకవర్గంలో ఒకే క్యాంపస్ లో గురుకులాలన్నీ ఉండేలా ఏర్పాటు చేసి కులాల మధ్య అంతరాలు చేరిపేయాలనుకుంటున్నామని, పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్ లో శంకుస్థాపన చేసామన్నారు.అంతేకాకుండా..'చదువుమీద పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి.. చదువుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఆకునూరి మురళి లాంటి వారికి చదువుకుంటేనే గుర్తింపు, గౌరవం వచ్చాయి. లోక్ సభ స్పీకర్ గా తెలంగాణ బిల్లును ఆమోదించింది జగ్జీవన్ రామ్ కూతురు మీరాకుమారి. తెలంగాణ రాష్ట్రమంతా మీరా కుమారిని ఎప్పుడూ గుర్తుచేసుకుంటుంది. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు.. ఒకసారి దొరల చేతిలో ఉంటే.. ఒకసారి దళితుల చేతుల్లో ఉంటుంది. దొరలకు ఇష్టం ఉన్నా లేకున్నా ఇవాళ అసెంబ్లీలో గడ్డం ప్రసాద్ గారిని అధ్యక్షా అని పిలవాల్సిందే.. కొందరు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నిస్తున్నారు%%% అసలు ఆ ప్రశ్నించే హక్కును, అధికారాన్ని కల్పించింది కాంగ్రెస్ పార్టీనే.. చదువును ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దు%%% చదువే లక్ష్యంగా పెట్టుకుని ఉన్నత శిఖరాలకు ఎదగండి' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## వర్షపాతంపై సిఎం రేవంత్ తప్పుడు సమాచారం




అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు సత్యదూరమైన మాట్లాడటం పట్ల తెలంగాణ సమాజం అసహ్యించుకుంటున్నదని తెలిపారు. రైతు సమస్యల పరిష్కారంపై రేవంత్ వ్యాఖ్యలు ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమని విమర్శించారు.లెక్కల ప్రకారం 2023-24 సంవత్సరానికి సాధారణానికంటే 14శాతం ఎక్కువ వర్షపాతం తెలంగాణలో నమోదు అయ్యింది. నీటి సమస్యలని తీర్చే చేవలేక, చేతకాక .. లోటు వర్షపాతం అని మాట్లాడడం విడ్డూరం అన్నారు. అబద్దాలు, అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు సత్యదూరపు మాటలు మాట్లాడుతోంది. అధికారంలోకి వచ్చిన తరువాత వారి ప్రవర్తన చూసి తెలంగాణ ప్రజలు అసహ్యించుకొంటున్నారు. సమస్యలు తీర్చడం మాట అటుంచి, తెలంగాణ రైతాంగానికి మూడు నెలల్లోనే స్కాంగ్రెస్ చేతగానితనం పూర్తిగా అర్థమయ్యిందని పేర్కొన్నారు.

## గ్యాస్ సిలిండర్లకు రాయితీ గడువు పొడిగింపు

### కేంద్రమంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ,మార్చి7(ప్రజా మంటలు): సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది.పేద , మధ్య తరగతి వర్గాలకు గుడ్ న్యూస్ చెప్పింది. పీఎం ఉజ్వల యోజన కింద గ్యాస్ సిలిండర్ పై అందిస్తున్న రూ. 300 సబ్సిడీని మరో ఏడాది పాటు పెంచింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ. 955గా ఉంది. ఈ స్కీమ్ లబ్ధిదారులకు రూ.300 సబ్సిడీ లభిస్తోంది. దీంతో వారు రూ. 655 కే గ్యాస్ సిలిండర్ పొందుతున్నారు. మార్చి నెలఖారుతో ఈ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఏప్రిల్ నుంచి మరో ఏడాదిపాటు పీఎం ఉజ్వల యోజన కింద గ్యాస్ సిలిండర్లపై రాయితీ ఇవ్వనుంది. ప్రధాని మంత్రి ఉజ్వల యోజన పథకం కింద 10 కోట్ల మంది లబ్ధిదారులు సబ్సిడీ పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో వారికి మరో ఏడాది ప్రయోజనం కలగనుంది.

## లిక్కర్ కేసు పెద్దదేమీ కాదు

కేసును టీవీ సీరియల్ కేసు లెక్క లాగుతున్నారు.. నాకు ఆమె అన్నారు. ఆదర్శ్ కుంభకోణం ఏమైందని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. సీతక్కకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, మహిళ అయిన ఆమెకు డిప్యూటీ సీఎం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అనుభవరాహిత్యం, అవగాహన లోపంతో సీఎం రేవంత్ పాలన ఉందని, అలాంటి ముఖ్యమంత్రి ఉండడం మన ఖర్మ అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థతతో రాష్ట్రంలో కృత్రిమ కరువు వచ్చిందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లను ఎత్తిపోయలేదని విమర్శించారు. సీఎం రేవంత్ డీఎన్ఏలోనే మోదీతో స్నేహం ఉందని చెప్పారు. ఆయన బీజేపీలో చేరే అవకాశం ఉందన్నారు. గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులు చనిపోతుంటే ముఖ్యమంత్రి పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్ భాష ఎలా ఉంది.. ఆయనపై కేసులు పెట్టాలన్నారు. మహిళల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఉద్యోగాల్లో మహిళా రిజర్వేషన్లపై న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద దీక్ష చేస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలని రెండు జాతీయ పార్టీలూ చూస్తున్నాయని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవకపోతే ప్రజలకే నష్టమన్నారు.

# ఎమ్మెల్సీల నియామకం చెల్లదు

### ఎమ్మెల్సీలను నియమించే అధికారం కేబినేట్‌దే

### అభ్యంతరాలు ఉంటే తిప్పి పంపాలే తప్ప

### కోదండరామ్, అమిర్ అలీఖాన్‌ల నియామకం చెల్లదు

### గవర్నర్ నిర్ణయాన్ని తప్పుపట్టిన హైకోర్టు

హైదరాబాద్,మార్చి7(ఆర్ఎన్ఎ): ఎమ్మెల్సీల నియామకాలపై తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీఖాన్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. భారాస ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆ పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ మంత్రిమండలి తీర్మానం చేసింది. దాన్ని గవర్నర్ తమిళిసై గతేడాది సెప్టెంబర్ 19న తిరస్కరించారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వారిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. గవర్నర్ పరిధి దాటి వ్యవహరించారని, మంత్రిమండలికి ఎమ్మెల్సీలను నామినేట్ చేసే హక్కు ఉంటుందని పిటిషనర్లు పేర్కొన్నారు. భారాస నేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. అనంతరం రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యాక నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమిర్ అలీఖాన్‌లను రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసి గవర్నర్ వద్దకు పంపింది. రాష్ట్ర మంత్రిమండలి సిఫార్సును అనుసరించి వారి పేర్లను తమిళిసై ఆమోదించారు. అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం కూడా లభించడంతో వారి నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే దీన్ని సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. గతంలో తాము వేసిన పిటిషన్‌పై నిర్ణయం వెలువడే వరకూ ఈ నియామకాలు ఆపాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై పిటిషనర్లు, రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ కార్యాలయం తరఫున న్యాయవాదులు సుదీర్ఘ వాదనల వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌ను కొట్టివేస్తూ గురువారం తీర్పు వెలువరించింది. ఎమ్మెల్సీల నియామకంపై ప్రభుత్వం పునఃసమీక్షించుకోవాలని సూచించింది. గవర్నర్ తీసుకున్న నిర్ణయంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాన్ని గవర్నర్ నేరుగా తిరస్కరించకుండా.. తిరిగి పంపించాల్సిందని కోర్టు అభిప్రాయపడింది. కొత్తగా ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను సూచిస్తూ గత ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను 2023, సెప్టెంబర్ 19న గవర్నర్ తమిళిసై రిజెక్ట్ చేసిన విషయం తెలిసింది. అయితే, కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్ అలీఖాన్ ల నియమించింది. ఈ నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రావణ్, సత్యనారాయణలు హైకోర్టును ఆశ్రయించారు. గతంలో తాము వేసిన పిటిషన్ పై విచారణ తేలేంత వరకు ఎమ్మెల్సీల నియామకాలను ఆపాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేయించవద్దని మండలి చైర్మన్ ను ఆదేశించింది. దాంతో కోదండరామ్, అమీర్ అలీఖాన్ ల ప్రమాణ స్వీకారానికి బ్రేక్ పడింది.

## పాతబస్తీ మెట్రోకు నేడు శంకుస్థాపన

### సిఎం రాకతో భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

హైదరాబాద్, మార్చి 7 (ప్రజా మంటలు):
పాతబస్తీ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మెట్రోరైలు పనులకు మోక్షం కలగనుంది. ఆ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈమేరకు ఫారూఖ్‌నగర్ వద్ద బల్దియా, విద్యుత్, మెట్రోరైలు అధికారులు, పోలీసులు ఏర్పాట్లు చేపట్టారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. సీఎం వచ్చే దారిలో జీహెచ్ఎంసీ అధికారులు డివైడర్‌కు రంగులు, రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నారు. దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, ఫలక్‌నుమా ఏసీపీ బి.యాదగిరి స్వామి, ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్రేటర్‌లో తొలిసారిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈనేపథ్యంలో గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. మ.12.30 గంటలకు సికింద్రాబాద్‌లో ఎలివేటెడ్ కారిడార్ పనులకు, 1.30 గంటలకు బంజారాహిల్స్‌లో డా.బాబు జగ్జీవన్‌రాం భవన్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేస్తారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జూపార్కు సమీపంలోని మీరాలం ఎస్టీపీని, 4.30 గంటలకు ఇబ్రహీం గోల్కొండ మైనార్టీస్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభిస్తారు. మార్చి 9వ తేదీన సాయంత్రం 4 గంటలకు ఎల్‌బీనగర్‌లో బైరామల్‌గూడ ఫ్లై ఓవర్‌ను, 4.30కు ఉప్పల్‌లో నల్లచెరువు ఎస్టీపీని, 5 గంటలకు సికింద్రాబాద్ ఎన్‌హెచ్44లో ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రారంభిస్తారు. మార్చి 12న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలతో రాష్ట్రస్థాయి సదస్సులో పాల్గొంటారు. డా.సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షస డిసీజెస్ ఆఫ్ ఇండియా కేంద్రం పనులకు శంకుస్థాపన చేస్తారు.

# ఉక్రియిన్‌పై క్షిపణిదాడి

### తృటిలో తప్పించుకున్న ఇరు దేశాధినేతలు

న్యూఢిల్లీ,మార్చి7(ప్రజా మంటలు):
రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం మొదలై గత నెల నాటికి రెండు సంవత్సరాలు పూర్తయ్యింది. అయినా కూడా పలు దేశాల నేతలు ప్రయత్నాలు చేసినా కూడా ఇప్పటి వరకు ఈ దేశాల మధ్య శాంతి నెలకొనలేదు. ఇప్పటికీ యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే ఉక్రెనియన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, గ్రీస్ ప్రధాన మంత్రి కిరియాకోస్ను కలిసేందుకు వెళ్లిన సమయంలో మరో ఎటాక్ జరిగింది. అయితే అతని కాన్వాయ్ అతి సమీపంలోనే రష్యా క్షిపణిచే దాడి జరుగగా ఇద్దరు దేశాల నేతలు తృటిలో తప్పించుకున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ గ్రీక్ ఎంబసీకి చేరుకున్నప్పుడు 100 మీటర్ల దూరంలో రష్యన్ క్షిపణి దాడి జరిగిందని తెలుస్తోంది. ఆ క్రమంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ స్వల్పంగా తప్పించుకున్నట్లు చెబుతున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత జలెన్స్కీకి అతి సమీపంలో క్షిపణి దాడి జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ఘటన చాలా నష్టాన్ని కలిగించిందని తనకు తెలుసని జెలెన్స్కీఈ ఘటన తర్వాత అన్నారు. తన దగ్గర ఇంకా అన్ని వివరాలు లేవని, కానీ చాలా మంది మరణించారని వెల్లడించారు. మనం ముందుగా మనల్ని మనం రక్షించుకోవాలని అన్నారు. దానికి ఉత్తమ మార్గం బలమైన వాయు రక్షణ వ్యవస్థను కల్గి ఉండటమేనని చెప్పారు. అంతేకాదు రష్యా ఇంతకుముందు కూడా చాలాసార్లు ఒడెస్సాను లక్ష్యంగా చేసుకుంది.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

### డీఏ 50 శాతానికి పెంపు

న్యూఢిల్లీ,మార్చి7(ప్రజా మంటలు): 7వ వేతన సంఘం ప్రతిపాదనల ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెరిగింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 50 శాతానికి డీఏ పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర మంత్రివర్గం సమావేశంలో డీఏ పెంపుపై నిర్ణయం తీసుకున్నారు. 7వ వేతన సంఘం సిఫారసుల ప్రకారం డీఏ 50 శాతానికి చేరుకోవడంతో కేంద్ర ప్రభుత్వ సిబ్బందికి చెల్లించాల్సిన ఇంటి అద్దె భత్యం, పిల్లల విద్యా భత్యం, రవాణా భత్యం కూడా పెరుగుతాయి. హెూమ్ పే ప్యాకెట్ అమలు చేసినప్పుడు డీఏ, డీఆర్ పెంపుదల 2024 జనవరి 1 నుంచి అమలులోకి వస్తుంది. మునుపటి నెలల బకాయిలతోపాటు పొందుతారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం పారిశ్రామిక కార్మికుల కోసం తాజా వినియోగదారుల ధరల సూచిక ఆధారంగా లెక్కిస్తారు. కార్మిక మంత్రిత్వ శాఖకు చెందిన లేబర్ బ్యూరో ప్రతి నెలా ఈ డేటాను ప్రచురిస్తుంది. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా జనవరి, జూలైలో సంవత్సరానికి రెండుసార్లు డీఏను సవరిస్తుంది. 2023 అక్టోబర్ లో కేంద్ర కేబినెట్ డీఏ 4 శాతం పెంచింది. దీంతో 46 శాతానికి చేరింది. డీఏ పెంపునకు గ 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల ఆధారంగా గుర్తింపు పొందిన ఫార్ములానే అనుసరిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ అదనపు వాయిదాను విడుదల చేయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. 2023 జూలై 1 ధరల పెరుగుదలను భర్తీ చేయడానికి ప్రాథమిక చెల్లింపు, పెన్షన్‌లో ప్రస్తుతం ఉన్న 42 శాతం రేటు కంటే 4 శాతం పెరుగుదలను సూచిస్తుంది. 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల ఆధారంగా ఆమోదించారు డీఏ, డీఆర్ రెండింటి కారణంగా కేంద్ర ఖజానాపై ప్రభావం సంవత్సరానికి రూ.12,857 కోట్లుగా ఉంటుంది. దీని వల్ల దాదాపు 48.67 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 67.95 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందుతారు.

# బెంగాల్‌లో మహిళలంతా సురక్షితమే

### ర్యాలీలో ముఖ్యమంత్రి మమత సందేశం

బెంగాల్,మార్చి7 (ప్రజా మంటలు):
గత కొద్ది రోజులుగా సందేశ్‌ఖాలీ ఘటనతో పశ్చిమబెంగాల్‌అట్టుడుకుంది. తృణమూల్ కాంగ్రెస్ నేత షాజహాన్, అతని మద్దతుదారులు భూకబ్జాలు, లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అనంతరం బీజేపీకి కూడా వారికి మద్దతుగా నిరసనలు చేపట్టింది. ఇక ప్రధాని మోడీ ఇటీవల బెంగాల్ పర్యటనలో సందేశ్‌ఖాలీ ఘటనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మమత సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి అండతోనే షాజహాన్ రెచ్చిపోయారని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా బాధిత మహిళలు కూడా మోడీని కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకుని ఆవేదన చెందారు. వారి మాటలు విన్న ప్రధాని కూడా కలత చెందారు. ఈ పరిణామాల నేపథ్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి మమత.. భారీ ఎత్తున మహిళలతో కలిసి కోల్‌కతాలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మమత మాట్లాడుతూ.. బెంగాల్‌లో ఉన్న మహిళలంతా సురక్షితంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. మణిపుర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించినప్పుడు వారంతా ఎక్కడికెళ్లారని ప్రశ్నించారు. అలాగే హాథ్రస్‌లో ఒక అత్యాచార బాధితురాలి మృతదేహానికి బలవంతంగా అంత్యక్రియలు నిర్వహించినప్పుడు ఎక్కడున్నారని నిలదీశారు. బిల్కిస్ బానోని మరిచిపోయారా? అంటూ బీజేపీపై మమత విమర్శలు గుప్పించారు. తమ రాష్ట్రంలో మహిళలు అత్యంత సురక్షితంగా ఉన్నారని మమత చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీలో సందేశ్‌ఖాలీ ప్రాంతానికి చెందిన మహిళలూ పాల్గొన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే సార్వత్రిక ఎన్నికల ముందు బెంగాల్‌లో హాట్ హాట్‌గా రాజకీయాలు సాగుతున్నాయి.

# దూకుడు పెంచిన కాంగ్రెస్

### యువతకు 5 ఎన్నికల హామీలు ప్రకటించిన రాహుల్

ఇప్పుడు యువతకోసం రైట్ టు అప్రెంటిషిప్ కల్పిస్తామని హామీ ఇచ్చారు రాహుల్ గాంధీ. ప్రతి గ్రాడ్యుయేట్ లేదా డిప÷-లోమా హెల్డర్ ఈ హక్కుకు అర్హులు అని ప్రకటించారు. ప్రతి గ్రాడ్యుయేట్, డిప÷-లోమా హోల్డర్ ప్రైవేట్ కంపెనీ లేదా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏడాది పాటు అప్రెంటీస్ షిప్ పొందుతారని దీనికి రూ. 1 లక్ష ఇస్తామని చెప్పారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది యువతకు సహాయం చేస్తుందన్నారు రాహుల్ గాంధీ. ఇక మూడో హామీగా.. పేపర్ లీక్ లు కాకుండా పరీక్షల నిర్వహణకు ప్రామాణికమైన చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ చట్టం కింద ప్రైవేట్ కంపెనీలకు ఔట్ సోర్సింగ్ ఉండదన్నారు. నాల్గో హామీగా రాజస్థాన్ లోని అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం ఆమోదించిన గిగ్ వర్కర్ల చట్టాన్ని జాతీయ స్థాయిలో అమలు చేస్తామన్నారు రాహుల్ గాంధీ. ఈ చట్టం ద్వారా గిగ్ వర్కర్లకు నిర్దిష్ట హక్కులను కల్పిస్తుందన్నారు. అంటే రాష్ట్రంలో ఉపాధి, నమోదు, సాధారణ నిర్ధిష్ట సామాజిక భద్రతా పథకాలకు అందేలా చేస్తుందన్నారు. ఇక ఐదో హామీగా 'యువ రోష్నీ పథకం'.. ప్రధాని మోదీ ప్రభుత్వం స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియాతో కేవలం ఇద్దరు ముగ్గురు బిలియనీర్లు మాత్రమే లబ్ది పొందారు.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే యువ రోష్నీ పథకం కింద స్టార్టప్ ఫండ్ రూ. 5వేల కోట్లు కేటాయిస్తామన్నారు. ఈ నిధి ప్రతి జిల్లాలో అందుబాటులో ఉంటుందన్నారు. 2022-23 లో తాను చేసిన భారత జోడో యాత్రలో అతిపెద్ద సమస్య నిరుద్యోగం అని నిరుద్యోగం, పేపర్ లీక్ ల గురించి యువత తనకు ఫిర్యాదు చేశారని యువత సమస్యలు తీర్చడమే లక్ష్యంగా తాము ముందుకెళతామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రకటించారు.

## మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలించిన ఎన్‌డీఎస్ఏ బృందం

రాత్రి హనుమకొండలో బస చేసిన అధికారుల బృందం గురువారం ఉదయాన్నే మేడిగడ్డ బ్యారేజీ వద్దకు వెళ్లింది. చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం మొదటగా ఎల్ అండ్ టీ గెస్ట్‌హౌస్‌లో అధికారులతో భేటీ అయ్యారు. ఆ తర్వాత బ్యారేజీ వద్ద ఏడో బ్లాక్‌లో కుంగిపోయిన ప్రాంతం.. దిగువ భాగంలో ఏర్పడిన పగుళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. గేట్ల సామర్థ్యం, కుంగుబాటుకు కారణాలపై ఈ కమిటీ పూర్తిగా అధ్యయనం చేయనుంది. ఇక్కడ పరిశీలన పూర్తి అయిన తర్వాత మధ్యాహ్నం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలనూ కమిటీ పరిశీలించనుంది. పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని ఈ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల గడువు విధించింది.

## బిజెపి తీర్థం పుచ్చుకున్న కె.కరుణాకరన్ కుమార్తె

### జవదేకర్ సమక్షంలో పార్టీలో చేరిక

ఆమె ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. ఆ తర్వాత దాన్ని తొలగించారు. ఆమె భాజపాలో చేరతారంటూ వచ్చిన వార్తలపై పద్మజ సోదరుడు, కాంగ్రెస్ ఎంపీ మురళీధరన్ స్పందించారు. ఆమె భాజపాలో చేరాలని నిర్ణయించుకుంటే అది ద్రోహమే అవుతుందని, ఆమెను చేర్చుకోవడం వల్ల ఆ పార్టీకి ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. తన తండ్రి మత రాజకీయాల విషయంలో ఎన్నడూ
రాజీ పడలేదని, ఆయన కుటుంబానికి చెందిన వ్యక్తి ఆ పార్టీలో చేరితే అది విచారకర పరిణామమని వ్యాఖ్యానించారు.

## వందరోజుల్లోనే ఎలివేటెడ్ కారిడార్‌కు మోక్షం

మోక్షం కలుగుతుందని భావించామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ కారిడార్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఇది పూర్తయితే సమయాన్ని పూర్తిగా తగ్గించవచ్చని అన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యను ముఖ్యమంత్రి పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ ఎలివేటర్ కారిడార్‌కి శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అందుకు సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఆర్ అండ్‌బీ, జీహెచ్ఎంసీ ఇతర అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

### కాకతీయ కళావైభవం వేయిస్తంభాల గుడి

### శివరాత్రి వేడుకలకు ముస్తాబు

వరంగల్,మార్చి 7 (ప్రజా మంటలు):
కాకతీయుల కళావైభవానికి, భక్తి పారవశ్యానికి నిలయం హన్మకొండ వేయి స్తంభాల దేవాలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడ శివరాత్రి ఉత్సవ వేడుకల ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. భక్తి భావంతో పాటు ఆలయంలో శిల్పకల ఉట్టిపడుతుంది. వేయి స్తంభాల దేవాలయాన్ని త్రికుటాలయంగా పిలుస్తారు. వేయి స్థంబాల పేరుతో నిర్మితమైన ఆలయ వైభవం నేటికి కొనసాగుతుంది. ఈ దేవాలయంలో శివలింగాన్ని రుద్రేశ్వర స్వామిగా కొలుస్తారు. అంతేకాదు వేయిస్థంభాల దేవాలయానికి మరో విశిష్టత ఉంది. శివరాత్రికి ఇక్కడ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. వేలాదిగా భక్తులు స్వామి వారిని అభిషేకిస్తారు. దీంతో ఇక్కడ శివునితోపాటు విష్ణుమూర్తి, సూర్య భగవానుడు కొలువుదీరాడు. 850 ఏళ్ల ఘనచరిత కలిగి దేశంలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది ఆలయం. క్రీ.శ. 1163లో కాకతీయుల రాజు రుద్రదేవుడి హయాంలో వేయిస్తంభాల ఆలయాన్ని నిర్మించారు. వేయి స్తంభాలతో ఆలయంతో పాటు ఆలయానికి ఎదురుగా కళ్యాణ మండపాన్ని అత్యంత సుందరనీగా తీర్చిదిద్దారు. కాకతీయులు శివభక్తులు కావడంతో వేయిస్తంభాల దేవాలయంలో భారీ ఆకారంలో ఉన్న శివలింగాన్ని ప్రతిష్టించారు. శైవ క్షేత్రాల్లో సాధారణంగా శివునికి, శివలింగానికి ఎదురగా నందీశ్వరుడు ఉంటారు. కానీ వేయిస్తంభాల దేవాలయంలో బిన్నంగా సూర్యభగవానుడు కొలువై ఉంటారు. ఈ ఆలయం మరో విశిష్టతను కల్గిఉంది.

## బీజేపీ కూటమిలోకి నవీన్ పట్నాయక్:15 ఏళ్ల తర్వాత బీజేడీ హింట్

న్యూఢిల్లీ,మార్చి7(ప్రజా మంటలు):
ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌కి చెందిన బిజూ జనతాదళ్(బీజేడీ), బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో చేరే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. ఈమేరకు చోటు చేసుకుంటున్న పరిణామాలు అందరిలోనూ ఇదే అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. 15 ఏళ్ల తర్వాత బీజేడీ ఎన్డీయే కూటమిలో చేరేందుకు చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో ఇరు పార్టీలు కలిసిపోటీ చేస్తాయనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, అధికారికంగా పొత్తుపై ఎలాంటి ప్రకటన రానప్పటికీ, రెండు పార్టీల నేతలు మాత్రం పొత్తుపై సంకేతాలు ఇస్తున్నారు. సీట్ల పంపకంలో చర్చలు విఫలమైన తర్వాత 11 ఏళ్ల రాజకీయ భాగస్వామ్యం తర్వాత 2009లో బీజేడీ ఎన్డీయే నుంచి వైదొలిగింది. ఒడిశాలో మొత్తం 21 లోక్‌సభ స్థానాలు, 147 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 13 స్థానాల్లో బీజేడీ, 8 స్థానాలు బీజేపీకి ఇచ్చే అవకాశం ఉందని బీజేడీ వర్గాలు తెలిపాయి. అయితే, బీజేపీ 9 లోక్‌సభ స్థానాలు, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 55 సీట్లను కోరుకుంటోంది. ప్రస్తుతం బీజేపీకి 8 మంది ఎంపీలు, 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. బుధవారం నవీన్ పట్నాయక్, పార్టీ కీలక నేతలతో తన నివాసంలో 3 గంటల పాటు సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. మరోవైపు ఒడిశా బీజేపీ నాయకులు కూడా అమిత్ షా, జేపీ నడ్డాలతో సమాంతర సమావేశాలను నిర్వహించారు. సమావేశంలో వారు బీజేడీతో పొత్తు గురించి చర్చించినట్లు సమాచారం. బీజేడీ సమావేశం తర్వాత ఆ పార్టీ ఉపాధ్యక్షుడు ఎమ్మెల్యే దేబి ప్రసాద్ మిశ్రా మాట్లాడుతూ.. బీజేపీతో పొత్తు గురించి చర్చలు జరుగుతున్నట్లు వెల్లడించారు. ఒడిశా ప్రజల ప్రయోజనాలకు బీజేడీ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఇదే విషయాన్ని బీజేడీ సీనియర్, ప్రధానకార్యదర్శి అరుణ్ కుమార్ సాహూ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. పొత్తుపై కేంద్ర నాయకత్వం చర్యలు తీసుకుంటుందని బీజేపీ ఎంపీ జుయల్ ఓరమ్ తెలిపారు. 2019 ఎన్నికల్లో బీజేపీ 8 మంది ఎంపీలను గెలుచుకోగా.. 23 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. బీజేడీకి 12 ఎంపీ, 112 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. 1998లో బీజేడీ, బీజేపీతో పొత్తు పెట్టుకుంది, కంధమాల్ అల్లర్ల తర్వాత ఇరు పార్టీలు 2009లో విడిపోయాయి. ఆగస్ట్ 25, 28, 2008 మధ్య జరిగిన పెద్ద ఎత్తున హింసలో దాదాపు 40 మంది క్రైస్తవులు మరణించారు. 395 చర్చిలు ధ్వంసం చేయబడ్డాయి మరియు 600 గ్రామాలు దోచుకున్నాయి. అదనంగా, 5,600 కంటే ఎక్కువ ఇళ్లు లూటీ చేయబడ్డాయి మరియు 54,000 మందికి పైగా నిరాశ్రయులయ్యారు. విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) నాయకుడు స్వామి లక్ష్మణానంద సరస్వతి, అతని నలుగురు అనుచరులను ముసుగులో వచ్చిన దుండగులు హత్య చేయడంతో అల్లర్లు ప్రారంభమయ్యాయి. వీరి హత్యకు మావోయిస్టులు కారణమని పోలీసులు ఆరోపించినప్పటికీ.. కంధమాల్ జిల్లాలోని స్థానికులు మాత్రం ఈ హత్యల వెనకాల క్రిస్టియన్ ఆదివాసీల హస్తం ఉందని భావించారు, దీంతో అల్లర్లు ప్రారంభయ్యాయి. సరస్వతి అనేక పాఠశాలలు, ఆశ్రమాలను స్థాపించారు. వీహెచ్‌పీ, సంఘ్ పరివార్ సంస్థలు క్రైస్తవం నుంచి తిరిగి హిందూ మతంలోకి రావడానికి చర్యలు తీసుకున్నాయి. ఇదిలా ఉంటే అల్లర్లకు ముందు డిసెంబర్ 2007న క్రిస్మస్ సందర్భంగా సంఘ్ పరివార్, క్రైస్తవులకు మధ్య ఘర్షణ జరిగింది. వందలాది ఇళ్లు తగలబడ్డాయి, దీనికి ప్రతిగా క్రైస్తవ మూకలు, హిందువుల ఇళ్లను తగలబెట్టారు. అల్లర్లు జరిగిన ఒక ఏడాది తర్వాత 2009లో నవీన్ పట్నాయక్ బీజేపీ వాటాను 9 ఎంపీ స్థానాల నుంచి 6కి, అసెంబ్లీలో 63 నుంచి 40కి తగ్గించాలని ప్రతిపాదించాడు. దీంతో కంధమాల్ అల్లర్లకు కారణంగా బీజేడీ, బీజేపీతో తెగదెంపులు చేసుకోవాలని నిర్ణయించుకుంది. కంధమాల్ అల్లర్లలో దోషిగా 2010లో బీజేపీ ఎమ్మెల్యే మనోజ్ ప్రధాన్‌తో సహా 18 మంది దోషులుగా తేలారు. ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించబడింది. అయితే, ఎన్డీయే నుంచి వైదొలిగినప్పటికీ నవీన్ పట్నాయక్ బీజేపీతో, ప్రధాని మోడీతో సఖ్యతతోనే ఉంటున్నారు. 2012, 2017, 2022లో జరిగి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులకు మద్దతు ఇచ్చారు. ఇటీవల జరిగిన ఒడిశా పర్యటనలో ప్రధాని మోడీ నవీన్ పట్నాయక్ తండ్రి బిజు పట్నాయక్‌కి నివాళులు అర్పించారు. రాష్ట్ర అభివృద్ధికి బిజూ బాబా సేవలు సాటిలేనివని ప్రధాని కొనియాడారు.

# కేంద్రమంత్రి జోషితో భట్టి భేటీ

### తాడిచర్ల బొగ్గు గనుల అనుమతులపై చర్చ

న్యూఢిల్లీ,మార్చి7(ప్రజా మంటలు):
ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర బొగ్గు గనుల మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కలిశారు. కేంద్ర అనుమతి లేక ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో తాడేపల్లి సెకండ్ బ్లాక్ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తాడిచర్ల-2 కోల్ బ్లాక్ కి అప్రూవల్‌పై కేంద్రం సానుకూలంగా స్పందించడం శుభవార్త అన్నారు డిప్యూటీ సీఎం. తాడిచెర్ల రెండో బ్లాక్‌లో 5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం వుందన్నారు భట్టి విక్రమార్క. సింగరేణికి, రాష్ట్రానికి ఇది ప్రయోజనమన్నారు. ఒడిషాలోని నైని కోల్ బ్లాక్‌లో తెలంగాణకు కేటాయింపులు చేసినప్పటకి అందుకు సంబంధించి ఆపరేషన్స్ ఇంకా మొదలు కాలేదు. ఆ విషయంలో కూడా కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి సానుకూలంగా స్పందించారన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. అటు కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్కే సింగ్‌తోనూ సమావేశమయ్యారు భట్టి విక్రమార్క. గ్రీన్ పవర్ సహా ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై చర్చించారు. పేదల ఇళ్లకు సోలార్ కరెంట్ అందించేలా కేంద్రం ఇచ్చే సబ్సిడీ కి అదనంగా మరింత ఖర్చును భరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పథకాన్ని కేంద్రమంత్రికి వివరించారు భట్టివిక్రమార్క. అభినందడంతో పాటు తప్పక చేయూతనిస్తామని ఆర్కేసింగ్ సానుకూలంగా స్పందించారన్నారు. తెలంగాణకు ఎంతో ప్రయోజనం కల్గించే రెండు ముఖ్య అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించడంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు .

# షీటీమ్స్‌తో పోకిరీలకు దడ
# మహిళల రక్షణలో ముందున్న టీమ్స్

**హైదరాబాద్,మార్చి7 (ప్రజామంటలు):**
తెలంగాణలో మహిళల రక్షణకు షీ టీమ్స్ ఏర్పాటు చేశాక మంచి ఫలితాలు వస్తున్నాయి. మహిళలకు అండగా అవి బాగా పనిచేస్తున్నాయి. మహిళా దినోత్సవం సందర్భంగా అనేక కార్యక్రమాలతో చైతన్యం చేపట్టారు. ఇకపోతే షీ టీమ్స్ ఏర్పాటు చేసినప్పుడు దీనిని బలోపేతం చేసి మహిళలకు అండగా నిలవడంలో స్వాతి లక్రా కృషి ప్రశంసనీయం. సిటీ పోలీస్ తరపున షీటీమ్స్ బాగా పనిచేయడంతో అనేక రాష్ట్రాల్లో దీనిని విస్తరించారు. ఇదో రకంగా తెలంగాణ షీ టీమ్స్‌కు దక్కిన గౌరవంగా చూడాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు చేపట్టారు. షీటీమ్స్ ఏర్పడినందున వారి పాత్రను,కృషిని అభినందించాల్సిందే. ఎన్నో క్లిష్టమైన సమస్యలను, కేసులను పరిష్కరించడంతో పాటు..మహిళలకు తామున్నామన్న భరోసా ఇవ్వడంలో షీ టీమ్స్ విజయం సాధించాయి. డయల్ 100, మహిళా భద్రత, షీ టీమ్స్ గురించి అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించారు. ఉమెన్ సేఫ్టీ విషయంలో అనేక చర్యలు తీసుకున్నారు. మహిళలను వేధించిన లేదా రేప్ కేసుల్లో నిందితులకు శిక్ష ఖరారు చేయించడంలో షీటీమ్స్ కీలక భూమిక పోషించాయి. యువతులు, మహిళలు ఇక నగరంలో నిర్భయంగా ఉండొచ్చన్న భరోసా దక్కడంలో ఈ టీమ్స్ బాగ కృషి చేస్తున్నాయి. వారికి అండగా, రక్షణగా 'షి' బృందాలను ఏర్పాటు చేసి వారి భద్రతకు తెలంగాణ ప్రభుత్వం ముందడుగేసింది. స్వాతిలక్రా ఆధ్వర్యంలో పనిచేసే ఈ బృందాల్లో అందరూ మహిళా పోలీసులే ఉంటారు. ఒక్కో బృందంలో ఐదుగురు మహిళా పోలీసులు ఉంటారు. వీరంతా సాధారణ డ్రెస్‌లోనే ఉంటారు. బస్టాపులు, రైల్వేస్టేషన్లు, ఆటోస్టాండ్ల వద్ద, కళాశాలల వద్ద నిఘా వేస్తారు. మహిళలను వేధింపులకు గురి చేసిన వారిని తక్షణమే అదుపులోకి తీసుకుంటారు. ఆపదలో ఉన్నప్పుడు వెంటనే 100కు ఫోన్ చేస్తే తక్షణ సాయం అందిస్తామని స్వాతిలక్రా మహిళలకు సూచించారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతూ షి బృందాలకు పట్టుబడిన వారు జాగ్రత్తగా ఉండకపోతే వారిపై క్రైమ్‌షీట్ తెరుస్తారు. ఆ వివరాలు అన్ని పోలీస్‌స్టేషన్లలో అందుబాటులో ఉండేలా సెంట్రల్ డేటాలో పొందుపరుస్తారు. ఈవ్‌టీజర్ల తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తారు. చట్ట ప్రకారం శిక్షించడమే కాకుండా, మళ్లీ పట్టుబడితే నిర్భయ కేసును నమోదు చేస్తారు. ఈవ్‌టీజర్లపై నిర్భయంగా ఫిర్యాదు చేయొచ్చని, ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. మొత్తంగా గతంతో పోలిస్తే షీ టీమ్స్ ఏర్పడ్డ తరవాత అనేక విజయాలు సాధించారు. అన్నింటికి మించి మహిళలకు భరోసా దక్కింది. అందుకే ఆడవాళ్ల జోలికొస్తే తాట వొలుస్తామంటున్నాయి తెలంగాణ షీ టీమ్స్. మహిళలపై దాడులు, వేధింపులు, ఆడపిల్లల పట్ల ఆకతాయిల చేష్టలకు చెక్ పెట్టేందుకు ఏర్పాటు చేసిన షీ టీమ్స్ వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తోంది. నమోదైన కేసులే ఇందుకు ఉదాహరణ. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం వారి రక్షణ కోసం షీ టీమ్స్‌ని 2018లో ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆడవాళ్లపై వేధింపులకు పాల్పడే వారిని ఉపేక్షించకుండా వారిపై కేసులు నమోదు చేస్తోంది ఈ మహిళ రక్షణ వ్యవస్థ. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 331 టీమ్స్ పనిచేస్తున్నాయి. షీ టీమ్స్ స్టార్ట్ అయిన కొత్తలో దాదాపు 5వేలకు పైగా కేసులు వచ్చేవి..కానీ రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతో వీటి సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. గతంలో మైనర్లు క్రైమ్‌లో ఇన్వాల్వ్ అయ్యేవారు. షీ టీమ్స్ ఇలాంటి కేసుల్లో పేరెంట్స్‌కి కౌన్సిలింగ్ ఇవ్వడంతో సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. ఫిర్యాదులు వచ్చిందే తడవు... ఆకతాయిలు, పోకిరీలను అరెస్ట్ చేసింది షీ టీమ్స్ వ్యవస్థ. ఇందులో ఎక్కువగా 25 సంవత్సరాల వయస్సున్న యువకులు మాత్రమే ఇలాంటి పనులు చేస్తున్నట్లుగా తెలంగాణ విమెన్స్ సేఫ్టీ వింగ్ ప్రకటించింది. ఎవరైనా వేధిస్తే గతంలో పోలీస్ కంప్లైంట్ ఇవ్వడానికి మహిళలు ముందుకొచ్చే వాళ్లు కాదని,కాని ఆన్‌లైన్‌లో, వెబ్ సైట్ ద్వారా అవగాహన కల్పించడంతో ఫిర్యాదులు చేయడానికి ధైర్యంగా ముందు కొస్తున్నారు. ఇప్పుడు ఎక్కువగా సైబర్ క్రైమ్ ఫ్రాడ్ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్నాయి. కాబట్టి ప్రతి ఒక్కరు కూడా జాగ్రత్తగా ఉండాలని ఏదైనా సమస్య వస్తే వెంటనే మా వాట్సాప్ నెంబర్ కి మెసేజ్ చేయండి... ఇప్పుడు మహిళలకు అండగా ఉంటుందని భరోసా ఇస్తున్నారు.

# పాలమూరు వెనకబాటుకు కాంగ్రెస్,టిడిపిలే కారణం

**చంద్రబాబు పాపాలు, కాంగ్రెస్ లోపాలే శాపాలు**

**పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులు చేసిన కెసిఆర్**

**రేవంత్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు**



**సంగారెడ్డి,మార్చి7 (ప్రజామంటలు):**
మహబూబ్‌నగర్ వెనుకబాటుతనానికి నాటి టీడీపీ, కాంగ్రెస్ పాలనే కారణమని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సీఎం రేవంత్ తిట్టాల్సి వస్తే తన గురువు చంద్రబాబును తిట్టాలని, కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను నిందించాలన్నారు. చంద్రబాబు పాపాలు, కాంగ్రెస్ పార్టీ లోపాలు పాలమూరు పాలిట శాపాలుగా మారాయని విమర్శించారు. పాలమూరు వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సంగారెడ్డిలో పార్టీ నాయకులతో కలిసి హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. పాలమూరు వలసలకు కారణం టీడీపీ, కాంగ్రెస్‌లేనన్నారు. గత పార్టీలు ప్రాజెక్టుల పేర్లు మార్చారు తప్ప పనులు పూర్తి చేయలేదని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో పాలమూరు ప్రాజెక్టులను పెండింగ్ ప్రాజెక్టులుగా మార్చారని విమర్శించారు. ఆ పెండింగ్ ప్రాజెక్టులను కేసీఆర్ రన్నింగ్ ప్రాజెక్టులు గా మార్చారని చెప్పారు. పాలమూరును పచ్చబడేలా చేసింది కేసీఆరేనని స్పష్టం చేశారు. పాలమూరుకు మళ్లీ వలసలు తిరిగొచ్చాయన్నారు. 2014కు ముందు పాలమూరు ఎలా ఉండేది.. ఇప్పుడెలా ఉందని ప్రశ్నించారు. పాలమూరును ఆనాడు చంద్రబాబు దత్తత తీసుకున్నారని, పదేండ్లు అధికారంలో ఉన్నా చంద్రబాబు పాలమూరుకు చేసిందేమీ లేదన్నారు. పాలమూరు కరువుతో కాంగ్రెస్, టీడీపీలు రాజకీయాలు చేశాయని విమర్శించారు. తాము పాలమూరు ప్రాజెక్టుకు అనుమతులు సాధించామని, కాలువలు తవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. పోతిరెడ్డిపాడు నుంచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నీళ్లు తీసుకెళుతుంటే రేవంత్ మాట్లాడలేదని విమర్శించారు. నాడు జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చారని ఆరోపించారు. 30 ఏండ్లలో కల్వకుర్తి ఆయకట్టు కింద 13 వేల ఎకరాలకు నీళ్లిచ్చారని, బీఆర్ఎస్ హయాంలో అదే కల్వకుర్తి కింది 3 లక్షల 7 వేల ఎకరాలకు సాగునీరు అందించామని చెప్పారు. నెట్టంపాడు కింద ఆనాడు 2700 ఎకరాలకు నీరివ్వగా, మహబూబ్ నగర్ జిల్లాలో తారు 6 లక్షల 50 వేల ఎకరాలకు నీళ్లిచ్చామని తెలిపారు. కాంగ్రెస్, టీడీపీ హయాంలో పాలమూరు నుంచి ప్రజలు వలసలు వెళ్లారని, కేసీఆర్ పాలనలో వలసలు వెళ్లిన ప్రజలు పాలమూరుకు తిరిగి వచ్చారని చెప్పారు. సాగు, తాగునీరు, విద్య, వైద్య రంగాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను ముందుకు తీసుకెళ్లామన్నారు. ఉమ్మడి పాలనలో ఒక్క మెడికల్, నర్సింగ్ కాలేజీ ఇవ్వలేదని, కానీ తాము పాలమూరు జిల్లాలో ఐదు మెడికల్ కాలేజీలు, టీచింగ్ దవాఖానలు ఇచ్చామని గుర్తుచేశారు.సీఎం రేవంత్ రెడ్డి తన పౌరుషాన్ని పాలనలో చూపెట్టాలని ఎద్దేవాచేశారు. ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టే నోటికొచ్చినట్టు మాట్లాడొద్దని సూచించారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. కేసీఆర్ కిట్లు తెస్తే.. రేవంత్ రెడ్డి తిట్లలో పోటీ పడుతున్నారని విమర్శించారు. తన ఎత్తు గురించి కూడా రేవంత్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, తాను కూడా ఆయన ఎత్తు గురించి మాట్లాడగలనని.. కానీ తనకు విలువలు ఉన్నాయని చెప్పారు. ఎవరెంత ఎత్తు ఉన్నారో ప్రజలకు అవసరం లేదని వెల్లడించారు.

# పసుపు ధరలపై రైతుల ఆందోళన

**గిట్టుబాటు ధరల కోసం చూపు**

**ఎంపి ధర్మపురి హామీతో ఊరట**



**నిజామాబాద్,మార్చి7 (ప్రజామంటలు):**
నిజామాబాద్ పసుపు మార్కెట్‌పై వ్యవహారం ఎటూ తేలకపోవడం, పసుపు బోర్డు ప్రకటించినా అది తనపనిని చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఎగుమతులు పెరుగుతున్నాయని, తొందరపడి అమ్ముకోవద్దని ఎంపి ధర్మపురి అర్వింద్ సూచించారు. పసుపుబోర్డుతో మేలు జరుగుతుందని అన్నారు. అయితే నిజామాబాద్ జిల్లాతోపాటు జగిత్యాల, నిర్మల్ జిల్లాల నుంచి వేల పసుపు బస్తాలను తీసుకొస్తున్న రైతుల సమస్యలను పట్టించుకునే వారే లేకుండా పోయారు. మద్దతు ధర, ఇతర సమస్యను తీర్చేవారే కరువయ్యారు. పసుపు రైతులను ఏళ్ల తరబడి ఎన్నికలకు అస్త్రాలుగా వాడుకొని లబ్ది పొందిన నేతలు పసుపు ధరపై పట్టించుకోవడం లేదు. దీంతో ఇటీవల మద్దతు ధరలకోసం జగిత్యాలలో పసుపు రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. నిజామాబాద్ మార్కెట్ లో పసుపు ధర రోజురోజుకూ తగ్గుతోంది. ఏళ్ల తరబడి సాగుచేస్తున్న రైతులకు ఈ యేడు వచ్చినంత తక్కువగా ఏ సంవత్సరం రాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు కొనుగోళ్లపై దృష్టి సారించకపోవడం వల్ల ధర పెరగలేదు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో వ్యాపారులు ఒడిదొడు కులను, పాత స్టాక్‌ను దృష్టిలో పెట్టుకొని కొ నుగోలు చేస్తున్నారు. గత సంవత్సరం కంటే తక్కువ ధరకు పసుపు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. భారీగా పసుపు వచ్చిన ధర మాత్రం మారడంలేదు. క్వింటాలుకు రూ.4 వేల నుంచి రూ.5వేల మధ్యనే ధర నిర్ణయిస్తున్నారు. పసుపునకు మద్దతు ధర కల్పిస్తాం అని ఏళ్ల తరబడి వాగ్దానాలు చేస్తున్నా ధరలు మాత్రం రావడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం క్వింటాలు కు రూ.6850 నిర్ణయించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం ధర నిర్ణయిస్తే తమకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. ఈ అయిదేళ్లలో పసుపు ధర భారీగా తగ్గింది. కూలీలు, ధరలు, ఎరువులు, ఇతర రసాయనాల ధరలు పెరిగాయి. రైతులకు మ్యాచింగ్ గ్రాంట్‌లాగా నిధులను విడుదల చేసి పసుపు రైతులకు ఇవ్వాలని కోరుతున్నారు.

# మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

**జంటనగరాల నుంచి పలు ప్రాంతాలకు సర్వీసులు**




**హైదరాబాద్,మార్చి7 (ప్రజామంటలు):**
మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని పలుప్రాంతాల నుంచి కీసరగుట్ట, ఏడుపాయల, బీరంగుట్ట జాతరలకు 340 ప్రత్యేక బస్సులను గ్రేటర్ ఆర్టీసీ నడుపుతోంది. గురువారం నుంచి ఆదివారం వరకు ఈ సదుపాయం ఉంటుందని, ఒక్కో ప్రాంతానికి ఓ ప్రత్యేకాధికారిని నియమించామని గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆఫ్జల్‌గంజ్, తార్నాక, ఈసీఐఎల్, కుషాయిగూడ, కీసర విలేజ్ పాయింట్స్ నుంచి కీసరగుట్టకు నడిపే స్పెషల్ ఆపరేషన్స్ ఇన్‌చార్జిగా కాచిగూడ డీఎం (9959226145), రాజేంద్రనగర్ (9959226147) డీఎంలను నియమించారు. రెజిమెంటల్ బజార్, సికింద్రాబాద్ స్టేషన్ నుంచి కీసరగుట్టకు నడిచే బస్సులకు కంటోన్మెంట్ డిపో మేనేజర్ (9959226143), అమ్ముగూడ, యాప్రాల్, వెంకటాపురం పాయింట్ల నుంచి కీసరగుట్టకు హకీంపేట డీఎం (9959226144), ఉప్పల్ ఎక్స్‌రోడ్ నుంచి కీసరగుట్టకు నడిపే బస్సులకు చంగిచర్ల డీఎం (7893088433) ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారు. గ్రేటర్‌తో పాటు పలుప్రాంతాల నుంచి కీసరగుట్టకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ కీసరగుట్టలో ఎంక్వైరీ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. మూడు షిఫ్ట్‌ల్లో ప్రయాణికులకు బస్సుల వివరాలు తెలిపేందుకు సిబ్బందిని నియమించనుంది. ప్రత్యేక బస్సుల వివరాల కోసం కోఠి (9959226160), రేతిఫైల్ బస్‌స్టేషన్ (9959226154) లలోని కమ్యూనికేషన్ సెంటర్లలో సంప్రదించవచ్చని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు.

# ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ కావాలి

**అప్పడే క్రీడాకారులకు అవకాశాలు**

**హైదరాబాద్,మార్చి7 (ప్రజామంటలు):**
ఓట్ల కోసం పథకాలు కాకుండా క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి. అందుకు క్రీడా పాలసీని ప్రకటించాలి. మెరికల్లాంటి క్రీడాకారులను తయారు చేసేందుకు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం కనీసం ఇప్పటి నుంచయినా ప్రయత్నించాలి. బాల్యంలోనే క్రీడాంశాలపై మక్కువ కల్పించి ప్రత్యేక స్పోర్ట్స్ స్కూళ్లను తెలవాలి. అందుకు ఎంత ఖర్చయినా వెరవకుండా ముందుకు సాగాలి. ఇవాళ ఇంట్లో ప్రతి మగపిల్లాడికి బ్యాట్ పట్టడం తప్ప మరో క్రీడ తెలియకుండా పోతోంది. క్రికెట్ మాత్రమే కాదు.. బ్యాడ్మింటన్ సహా అనేక ఆటలు ఉన్నా యన్న సంగతి ముందుగా తెలియ చెప్పాలి. మన ఒకప్పుడు హాకీ క్రికెట్ కంటే మిన్నగా అభిమానుల ఆదరణకు నోచుకుంది కానీ.. తర్వాత భారత జట్టు ప్రదర్శన లాగే దానికున్న ఆదరణా పడిపోయింది. అది మన జాతీయ క్రీడ అయినా దానిని పక్కన పెట్టేశాం. హాకీతో పాటు మిగతా ఆటలన్నీ కూడా ఉన్నా వాటిని ఆదరించుకోవడం లేదు. నిరాదరణ కారణంగానే కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, తదితర క్రీడలన్నీ కనుమరుగవుతున్నాయి. ప్రైవేట్ ప్రోత్సాహంతో సింధులాంటి వాళ్లు షటిల్ బ్యాడ్మింటన్ పట్టల మక్కువ పెంచుకోవడంతో ఇప్పుడు దీనికి ఆదరణ పెరగగలదు. గత కొన్నేళ్లలో బ్యాడ్మింటన్ అంచెలంచెలుగా ఎదిగి, ఆదరణ పెంచుకుని.. ఇప్పుడు దేశంలో లక్షల మంది ఆ ఆట ఆడేందుకు ముందుకొచ్చేలా.. కోట్ల మంది కీలక మ్యాచ్‌లను వీక్షించేలా చేయగలిగింది. ఇందులో పుల్లెల గోపీచంద్ పాత్ర అత్యంత కీలకం. బ్యాడ్మింటన్ బంగారు భవిష్యత్తుకు గట్టి పునాది వేశాడు గోపీచంద్. దశాబ్దం కిందట అతను నెలకొల్పిన అకాడమీ ఇప్పుడిప్పుడే వేళ్లూను కుంటోంది. సైనా రూపంలో ప్రపంచ స్థాయి క్రీడాకారిణిని తీర్చిదిద్ది.. దేశంలో బ్యాడ్మింటన్ ముఖచిత్రాన్నే మార్చేసిన ఘనత గోపీచంద్‌ది. ద్రోణాచార్య లాగా తర్ఫీదు ఇచ్చి మెరికల్లాంటి షటిలర్లను తయారు చేస్తున్నాడు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ గొప్ప పురోగతి సాధించింది. ఇప్పటికే ఆడేందుకు, చూసేందుకు మంచి ప్రత్యామ్నాయంగా మారిన బ్యాడ్మింటన్‌పై ఆసక్తి రెట్టింపవుతుందనడంలో సందేహం లేదు. అయితే ఈ స్ఫూర్తి కొనసాగాలంటే, మరిన్ని పతకాలు రావాలంటే ప్రభుత్వాల క్రీడా విధానాంలో మార్పుల రావాలి. కోచ్‌లను,క్రీడాకారులను ప్రోత్సహించాలి. అందుకే చైనా తరహాలో భారత్ ప్రభుత్వం కూడా క్రీడలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే విధంగా తయారవ్వాలి. సింధు మ్యాచ్‌లను చూసినప్పుడు కలిగిన అనుభూతి ఇప్పుడు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి నింపుతుందనడంలో సందేహం లేదు.

# నకిలీ కాస్మెటిక్స్ తయారీ సంస్థల సీజ్

**వరుసగా దాడు చేస్తున్న డ్రగ్స్ కంట్రోల్**

**హైదరాబాద్,మార్చి7 (ప్రజామంటలు):**
గత కొన్ని రోజులుగా డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సోదాలు చేస్తుంది. బ్లడ్ బ్యాంకులు, మెడికల్ షాపులు, ఫార్మా కంపెనీలతో సహాలు పలు సంస్థలపై దాడు చేసింది. తాజాగా గురువారం ఏకకాలంలో రెండు జిల్లాల్లో డ్రగ్ కంట్రోల్ అధికారులు రైడ్స్ చేశారు. హైదరాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలో డీసీఏ అధికారులు సోదాలు చేసి పలు కాస్మోటిక్స్, హెయిర్ ఆయిల్స్ వంటివి సీజ్ చేశారు. హైదరాబాద్ లోని జియోగుడాలో ఇల్లిగల్ గా తయారీ చేస్తున్న కాస్మోటిక్స్ స్థావరంపై రైడ్ చేశారు. నాగ్రిస్ హెర్బ్స్ అనే సంస్థ లైసెన్స్ లేకుండా పకీజా గోల్డ్ మెహందీ కోన్, పాకీజా ఆర్ట్ హెన్నా, పాకీజా ఫాస్ట్ ఆర్ట్ హెన్నా ఇన్‌స్టంట్ కోన్, పాకీజా ప్యూర్గి÷డ్ వంటి బ్రాండ్ పేర్లతో మెహందీ కోన్స్ (హెన్నా పేస్ట్), హెన్నా పౌడర్‌లను ఉత్పత్తి చేస్తుందని పక్కా సమాచారం రావడంతో అధికారులు తనిఖీ నిర్వహించారు. కంపెనీకు లైసెన్స్ లేదని అధికారులు గుర్తించి హెన్నా పౌడర్ కాస్మెటిక్ అన్నింటిని సీజ్ చేశారు. మరోవైపు మహబూబ్ నగర్ జిల్లాలో కూడా డీసీఏ అధికారులు రైడ్ చేశారు. మూర్ఛ చికిత్స కోసం తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తూ జాడీ బూటీ నరిషింగ్ హెయిర్ ఆయిల్ ను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న వాటిని సీజ్ చేశారు. జడ్చర్లలో బెల్లాకేర్ సిరప్ తో స్త్రీలకు చికిత్స చేస్తున్నందుకు తనిఖీ చేసిన అధికారులు తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసినందుకు సీజ్ చేశారు.



## సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండండి
## భోలక్ పూర్ లో పారిశుద్ధ్యంపై అవెర్నెస్

**జీహెచ్‌ఎమ్సీ చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు**

**సికింద్రాబాద్ మార్చి 07 (ప్రజామంటలు):**
రాబోవు కాలాన్ని దృష్టిలో ఉంచుకొని, ఇప్పటి నుంచే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ఎంటమాలజీ సిబ్బందితో సహకరించాలని జీహెచ్‌ఎమ్సీ చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు కోరారు. గురువారం బన్సీలాల్ పేట డివిజన్ భోలక్ పూర్ లోని కృష్ణానగర్ లో ఇంటింటికి వెళ్ళి పరిసరాల శుభ్రత, దోమలతో కలుగు ప్రాణాంతక వ్యాధులు, దోమల నివారణ తదితర అంశాలపై కరపత్రాలతో అవెర్నెస్ కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జీహెచ్‌ఎమ్సీ సిబ్బంది చేసే దోమల నివారణ మందుల స్ప్రే పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ శ్రీనివాస్ రెడ్డి, సూపర్ వైజర్ రాజేందర్ రెడ్డి, రాజేశ్వర్, సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్న ఎస్ఐ ఏ. అనిల్



**ఇబ్రహీంపట్నం మార్చ్ 07 (ప్రజా మంటలు):**
ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన అబ్బిడి శ్రీనివాస్ అనునతడు కోమటికొండపూర్ శివారులో గల గోదావరి నుండి అక్రమంగా ఇసుకను తన ట్రాక్టర్ లో తరలిస్తుండగా ఇబ్రహీంపట్నం శివారులో పట్టుకొని పోలీస్ స్టేషన్ కి తీసుకొని వచ్చి అతని పై కేసు నమోదు చేయడం జరిగింది అని ఎస్సై ఏ. అనిల్ తెలిపారు.

## జిల్లాలోని పలు ప్రాంతాల్లో హెూటలలో వినియోగిస్తున్న 'డొమెస్టిక్ సిలిండర్ల' పట్టివేత, 20 కేసులు నమోదు




**జగిత్యాల మార్చ్ 07 (ప్రజామంటలు):**
జిల్లా కలెక్టర్, జగిత్యాల ఆదేశముల మేరకు మెట్ పల్లి పట్టణ పలు ప్రాంతాలలో డొమెస్టిక్ సిలిండర్ల ఉపయోగిస్తున్న వాణిజ్య సంస్థలు, హెూటల్ లపై తనిఖీలు నిర్వహించి (20) కేసులు నమోదు చేయడం జరిగింది. పౌరసరఫరా నాయబ్ తహశీల్దార్, జగిత్యాల, మల్యాల, మెట్ పల్లి మరియు పౌరసరఫరా ఇన్స్పెక్టర్, జగిత్యాల, మల్యాల, మెట్ పల్లి గార్లు మెట్ పల్లి పట్టణ పలు ప్రాంతాలలోని హెూటల్ లలో తనిఖీలు నిర్వహించి (36 ) డొమెస్టిక్ సిలిండర్లను గుర్తించి (20) వ్యక్తులపై కేసులు నమోదు చేసి సిలిండర్లను స్వాదిన పరచుకొని సంబందిత గ్యాస్ ఏజెన్సీకి భద్రతా నిమిత్తం అప్పగించనైనది. అదే విధముగా సబ్సిడీ సిలిండర్లు ను దుర్వినియోగం చేసే వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల అధికారి, జగిత్యాల ఆదేశించినారు.

## చిలకలగూడలో గుర్తు తెలియని యువకుడి డెడ్ బాడీ

**మర్డర్ చేసి, బాడీని ఫుట్ పాత్ పై పడేసి వెళ్ళిన దుండగులు**



**సికింద్రాబాద్ మార్చ్ 07 (ప్రజామంటలు):**
గుర్తు తెలియని యువకుడి డెడ్ బాడీ చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. స్టేషన్ హౌజ్ ఆఫీసర్ బి. అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం...గురువారం తెల్లవారుజామున 3 గంటలకు చిలకలగూడ నుంచి సీతాఫల్మండి వెళ్ళే దారిలో గార్బేజీ క్లియర్ చేస్తున్న జీహెచ్ఎమ్సీ వర్కర్లకు రైల్వే క్వార్టర్ల సమీపంలోని ఫుట్ పాత్ పైన 25%--% 30 ఏండ్ల వయస్సు కలిగిన యువకుడి డెడ్ బాడి కనిపించింది. వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా, యువకుడి ఛాతీ ఎడమవైపున పదునైన ఆయుధంతో తీవ్రంగా గాయపరచి, ప్రాణం తీసినట్లు గుర్తించారు. యువకుడిని ఎక్కడో హత్య చేసి, ఇక్కడికి తీసుకొచ్చి పడేసి వెళ్ళినట్లు భావిస్తున్నారు. ఈసంఘటన స్థానికంగా సంచలనం రేపింది. హత్య ఘటనకు సంబందించిన వివరాలు గాని, యువకుడి వివరాలు గాని తెలిసిన వారు చిలకలగూడ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని, 040%--%27853597, 8712661252 నెంబర్లకు ఫోన్ చేసి తెలపాలని ఇన్స్పెక్టర్ బి. అనుదీప్ పేర్కొన్నారు.

## విధ్యార్థులకు పరీక్ష పరికరాలు అందజేసిన కానిస్టేబుల్

**ఇబ్రహీంపట్నం మార్చ్ 07 (ప్రజామంటలు):**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో గల ఎర్దండి గ్రామానికి చెందిన, గుజ్జరి సుమన్ జగిత్యాలలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు, తాను చదువుకున్న పాఠశాలలో ఈ నెల 18 నుండి ,పదవతరగతి విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు అని తెలిసి, వారికి పరీక్ష పరికరాలను అందజేశారు. జగిత్యాలలో విధులు నిర్వహిస్తూ భగత్ సింగ్ యువసేన సహాయంతో వారు పరికరాలను అందజేయడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో యూత్ సభ్యులు శివ, మనోహర్, సాయి కుమార్, అభి, అమృత్ చారి, వంశీ, శరత్ పాల్గొన్నారు.



ఏటా మహిళా సదస్సుల..మహిళల గురించి గొప్పగా చెప్పుకుంటున్నా వారి అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. ఆడపిల్లల చదువులకు, క్రీడలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఏవీ అమలు కావడం లేదు. ఆడపిల్లల చదువులకు ప్రత్యేక రుణాలు, వడ్డీలేని పథకాలు అమలుచేసివుంటే బాగుండేది. ఉద్యోగాలు లేవు. చదువుకునే మహిళలకు కనసీం ఫ్రీ చదువులు లేవు. విద్యా రుణాలు తీసుకుంటే కనీసం వడ్డీ మాఫీ గురించి కూడా ఆలోచన చేయడం లేదు. అలాచేసివుంటే బేటీపడావో..బేటీ బచావోకు అర్థం ఉండేది. మహిళలను గౌరవిస్తున్న మనదేశంలో మహిళల కోసం ఏం చేశారంటూ ఏమీ లేదు. ఓ గిరిజన మహిళను రాష్ట్రపతిగా చేయడం మాత్రం అభినందించాల్సిందే. ఘనత వహించిన మోడీకి ఇవన్నీ తెలియనివి కాదు. జిఎస్టీ రాబుడులను ఎలా పెంచాలన్న ఆలోచన తప్ప ఇలాంటి విషయాల్లో చిత్తశుద్ధి లేదు. ఆర్థిక మంత్రిగా ఓ మహిళ ఉన్నా మహిళలకు ఒనగూరుతున్న ప్రయోజనం లేదు. మహిళా బిల్లుకు సంబంధించి బిల్లు పాస్ యినా అది అప్పుడే అందుబాటులోకి రాలేదు. దానికి మరో ఐదేళ్లు వేచిచూడాల్సి రాక తప్పదు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడంలో అధికార విపక్ష సభ్యులు ఉమ్మడిగా విఫలం అయ్యారు. బిల్లును పాస్ చేసినా అమలు కాకుండా అటకెక్కించారు. ఈ బిల్లుతో రాజకీయ లబ్ది పొందానలన్న బిజెపి ఎత్తుగడ తప్ప వారికి మేలు చేయాలన్న పట్టుదల, చిత్తశుద్ధి మోడీలో లేకుండా పోయింది. ఈ ఎన్నికల్లోనే వారికి రిజర్వేషన్లు అమలయివుంటే బాగుండేది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఇలా ఏటేటా జరుపుకుం టున్నా...మన నేతల్లో మార్పు రావడం లేదు. చట్టసభల్లో వారికి రావాల్సిన వాటాను కావాలనే ఇంతకాలం అడ్డుకున్నారు. సమాజంలో మహిళలకు ఉన్న అత్యుతన్నస్థాయి గౌరవాన్ని మనమే

# మహిళాభ్యుదయం మన సంకల్పం కావాలి !

దిగజార్చుకుంటున్నా పెద్దగా భయపడడం లేదు. బేటీపడావో.. బేటీ బచావో ఓ నినాదంగా మారింది. కనీసం వారి అభిప్రాయా లకు విలువను ఇచ్చినట్లుగా ఉండేది. కానీ అలా జరగలేదు. కేవలం వారికి శుభాకాంక్షలు చెప్పడంతో బడానేతలు తప్పించుకున్నారు. తమ ధర్మాన్ని విస్మరించారు. సమాజం కూడా వారిని ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నది.. అమ్మాయి కనిపిస్తే రేప్ చేయడమే లక్ష్యంగా మృగాళ్లు చెలరేగి పోతున్నారు. అందుకే చట్టసభల్లో వారికి గౌరవం ఇచ్చేలా రిజర్వేషన్ బిల్లును తక్షణం అమలుచేసివుంటే బాగుండేది. పరిస్థితులపై మనమంతా మహిళల హక్కులపై చర్చించాలి. వారి గౌరవానికి భంగం కలిగించే అంశాలపై యుద్ధం చేయాలి. అనేకానేక అవరోధాల మధ్య కూడా తమతమ రంగాలలో శక్తిమంతమైన మహిళగా ఆమె నిరూపించుకుంటూనే ఉంది. వ్యక్తిత్వ హననం జరుగుతున్నా.. సమాజంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటూనే ఉంది. మహిళాభ్యుదయమే దేశాభ్యుదయం అని మనమంతా కీర్తిస్తూ వారిని మభ్య పెడుతున్నామని గుర్తించాలి. మహిళా సమానత్వమే సమాజానికి హితం చెబుతున్న పాలకులు సమాన గౌరవం ఇచ్చి చట్టసభల్లో ప్రవేశించేలా చేయడంలో మాత్రం విఫలం అవుతున్నారు. మహిళల్లో స్ఫూర్తిని నింపడమే గాకుండా, వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపి వారిని మనతో సమానంగా ముందుకు తీసుకుని వెళ్లడంలో పురుష సమాజం విఫలమయ్యిందనడంలో సదేహం లేదు. ఇక దీనిని సవాల్‌గా తీసుకుని మహిళలే తమ హక్కుల కోసం పోరాడాలని గుర్తుంచుకోవాలి. పురుషాహంకార సమాజాన్ని నిలదీయాలి. నిగ్గదీయాలి. తమ హక్కులను సాధించే వరకు పోరాటాన్ని కొనసాగించాలి. భారత రాజకీయాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నా తగినంతగా ప్రోత్సాహం మాత్రం దక్కడం లేదు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఎందుకనో రాజకీయంగా ముందుకు సాకుండా అణగదొక్కుతున్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కారణంగా ఎందరో మహిళలు తమ సత్తా చాటుతున్నారు. అసెంబ్లీ,పార్లమెంటుల్లో మాత్రం రిజర్వేషన్ల దక్కితేనే మరింతగా రాణిస్తారు. వారిని అణచి వేయడం వల్ల 50శాతం జనాభా ఆకాంక్షలను కాలరాస్తున్న వారం అవుతున్నాం. మహిళా సాధికారతతో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పాలన సాగాలి. అన్నిరంగాల్లో మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించి నప్పుడే సామాజిక ప్రగతి సాధ్యపడుతుంది. అలాగే చదువుకునే అమ్మాయిలకు ఉచిత విద్యా రుణాలు అందాలి. అలాగే వారి ఉన్నత విద్యాకు ప్రభుత్వాలు చేయూత నివ్వాలి. బేటీపడావో ..బేటీ బచావో నినాదం కార్యరూపం దాల్చాలి. మహిళలను విలాసవస్తువుగా చూసే సంస్కృతిపై



కఠినంగా వ్యవహరించాలి. అత్యాచారాలు, వేధింపులపై కఠినంగా వ్యవహరించేలా చట్టాలు రావాలి. ప్రజాస్వామ్యంలో కేవలం అధికార పక్షమే కాదు ప్రతిపక్షాలకూ, ప్రజలందరికీ పాత్ర ఉంటుంది. ఇది గమనించి అందరూ ముందుకు సాగాలి. మహిళల గొప్పతనాన్ని భారతీయ మహిళల ఆదర్శాలను ప్రముఖంగా ప్రస్తావించిన మన సంస్కృతిని ముందుకు తీసుకుని వెళ్లే క్రమంలో సమాజం వారిపట్ల గౌరవభావంతో సాగాలి. విద్యా,క్రీడా, సాంస్కృతిక రంగాల్లో వారిని ముందుకు నడిపించేలా నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగాలి. అప్పుడే మనం ఆశించిన మహిళాభ్యుదయం సాకారం అవుతుంది.



# దేశానికి గర్వకారణం మహిళా క్రీడాకారులు



## భారత కీర్తిపతాకను రెపరెపలాడించి వారెందరో వారికి మరింత ప్రోత్సాహం దక్కాలి

హైదరాబాద్,మార్చి7(ఆర్ఎన్ఎ): క్రీడారంగంలో మెరుపులు పూయిస్తున్న ఎందరో మహిళా క్రీడాకారులు భారత కీర్తిపతాకాన్ని ఆకాశంలో ఎగురవేశారు. సానియా మిర్జా,సైనా నెహ్వాల్, పివి సింధు, మేరీ కోమ్,స్మృతి మందాన వంటి వారు ప్రస్తుత సమాజంలో ఇంకా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. వారు క్రీడారంగంలో చేస్తున్న కృషి భారత ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది. క్రికెట్‌లో కూడా తమకు ఎదురు లేదని చూపుతున్నారు. ఇందులో తెలుగమ్మాయి పివి సింధు ఎన్నో అద్భుతాలతో రాణించి పద్మశ్రీని దక్కించుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో మెరిసిన పి.వి.సింధు కృషి అభినందనీయం. ఆమె ఎలాంటి ప్రోత్సాహం లేకుండానే రాకెట్ పట్టి ఎంతో కఠిన దీక్షతో ఈ దశకు చేరుకుంది. ఈ యజ్ఞంలో ఆమె ఎక్కడా తడబాటుకు గురికాకుండా, ఆత్మస్థయిర్యం కోల్పోకుండా అప్రతిహతంగా ముందుకు సాగిన తీరు అభినందనీయం. ఇంతటి ఘనకీర్తి సాధించడానికి వ్యక్తిగతంగా ఆమె కష్టపడితే ఆమె కష్టానికి తల్లిదండ్రు లు, కోచ్ పుల్లెల గోపీచంద్ తోడ్పడ్డారు. అయితే ఆర్థికంగా కూడా ఆమె ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడినా స్వర్ణం గెలవడం సింధుకు మరచిపోలేని అనుభూతిగా మిగిలింది. గతంలో వరుసగా రెండేళ్లు సెమీ ఫైనల్ చేరి కాంస్య పతకాలతోనే సరిపెట్టుకుని, ఆ తర్వాత వరుసగా రెండేళ్లు ఫైనల్ చేరినా రజత పతకానికే పరిమితమైంది. పక్కా ప్రణాళికతో సిద్ధమై అనుకున్నది సాధించి, విశ్వకిరీటాన్ని అందుకొన్న తొలి భారత క్రీడాకారిణిగా గణుతి కెక్కింది. 'రియో'తో మొదలైన జోరును ఇంకా కొనసాగిస్తున్న సింధు ప్రపంచ టోర్నీ స్వర్ణంతో తన స్థాయిని మరింత పెంచుకుంది. నిజానికి రియోలో ఒలంపిక్స్‌లో సింధు రజత పతకం, సాక్షి కంచు పతకం సంపాదించడంతో భారత్ పరువు నిలిపారు. అయితే ఒలంపిక్స్ పట్టికలో మనం ఎప్పుడూ కింది నుంచి ఫస్ట్ ఉండడానికి ప్రయత్నిస్తున్నాం. సింధులాంటి వారు పతకాలు సాధించారంటే అందులో ప్రభుత్వాల ఘనకార్యం ఏమీ లేదు. వారు తమ సొంతంగా ఆట నేర్చుకుని మన పరవును నిలబెట్టేందుకు ప్రయత్నించారు. నిజానికి ముందునుంచే ప్రభుత్వాలు వీరిని ప్రోత్సహించి ఉంటే బంగారు కొండల్లా మెరిసేవారు. బేఠీ బచావో..బేఠీ పడావో నినాదంగా మారరాదు. సింధును స్ఫూర్తిగా తీసుకుని ఆడపిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. ఆడపిల్లల క్రీడలకు, విద్యకు ఉచిత సౌకర్యాలు, మినహాయింపులు ఇవ్వాలి. అలా చేయడం ద్వారా సింధు లాంటి ఎందరినో తయారు చేసుకోవాలి. సింధు సాధించిన విజయంతో దేశంలో బ్యాడ్మింటన్‌కు మరింత ఊపు వస్తుందనడంలో సందేహం లేదు. సింధు గెలిచిన స్వర్ణపతకం దేశంలో షటిల్ విప్లవానికే కాకుండా క్రీడా విప్లవానికి, ప్రభుత్వాలు కళ్లు తెరవడానికి తెరతీయాలని కోరుకుందాం. సైనాకు తోడు సింధు, కశ్యప్, జ్వాల, అశ్విని లాంటి క్రీడాకారిణులు కూడా ప్రపంచ స్థాయికి ఎదగడంతో రాకెట్‌కు మరింత ఊపొచ్చింది. ఇప్పటిదాకా భారత బ్యాడ్మింటన్‌లో సాధించిన పురోగతి అంతా ఒక ఎత్తయితే.. సింధు స్వర్ణం గెలవడం మరో ఎత్తు. ఇకపోతే స్మృతి మంధానలాంటి వారుక్రికెట్‌లో అత్యున్నత స్థాయికి చేరారు. అన్నింటికిమించి కరణం మల్లేశ్వరి ఢిల్లీ స్పోర్ట్స్ వర్సిటీ విసి కావడం గర్వకారణం. అలా అన్ని ప్రభుత్వాలు కూడాక్రీడాకారులను ప్రోత్సహించేలా నిర్ణయాలు ఉండాలి.













# మహిళల్లో ఆర్థిక స్వాలంబన ముఖ్య ఇన్‌స్పైర్ ఇంక్ల్యూజివ్ ఈ యేడాది థీమ్ !

**న్యూఢిల్లీ, మార్చి 7 (ప్రజామంటలు):** యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా ....అన్న ఆర్యోక్తిని మననం చేసుకోవడం నిరంతరంగా సాగాలి. ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు పూజలందు కొంటారు. ఎక్కడ స్త్రీలు గౌరవించబడరో అక్కడ ఎంత గొప్ప సత్కార్యాలైననూ ఫలించవు అని మన సంస్కృతి తెలుపుతుంది. ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో, ఎక్కడ స్త్రీలను దేవతగా భావించి పూజి స్తారో, అక్కడ సర్వసంపదలూ ఉండడమేకాక రథ, గజ, తురగ పదాదులతో కూడిన లక్ష్మీ దేవి అచంచలయై నిలబడుతుంది. 1975వ సంవత్సరం నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి అధికారికంగా నిర్వహించటం ప్రారంభించింది. అంతేకాదు, ప్రతి ఏటా ఏదో ఒక ఇతివృత్తం అంటే థీమ్‌తో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2024 థీమ్ ఇన్‌స్పైర్ ఇంక్లూజివ్ ..ఆర్థిక విధాన రూపకల్పనకు సంబంధించి నిర్ణయం తీసుకునే ప్రక్రియలో మహిళలను ఆర్థికంగా భాగస్వాములుగా ఎలా చేయవచ్చో థీమ్ హైలైట్ చేస్తుంది. భవిష్యత్ వైపు అడుగులు వేయాలంటే మహిళలు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. విప్లవాత్మక మార్పుల కోసం అడుగు వేయాలని తెలిపింది. మహిళల పురోగతిని నిరోధించే సాంస్కృతిక, చారిత్రక, సామాజిక-ఆర్థిక అవరోధాల అడ్డును తొలగించాలనేది ఈ థీమ్ ముఖ్య ఉద్దేశ్యం. స్త్రీలు సాధికారత, ఆర్థిక స్వావలంబన పొందాలంటే ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలి. ముఖ్యంగా దిగువ, మధ్యతరగతి స్త్రీలకు ఆర్థిక అక్షరాస్యతను కలిగించాలి. వ్యక్తిగత ఖర్చులు, కుటుంబ బడ్జెట్, పొదుపు, ఆదాయం తెచ్చే పెట్టుబడి... వీటి గురించి అవగాహన ఉండాలి. 'మీ జీవితం మీ చేతుల్లో ఉండాలంటే' మీ దగ్గర ఎంత డబ్బు ఉండాలి... అందుకు ఏమి చేయాలో తెలుసుకోవాలి. సొంత ఆస్తి, స్వీయపేరు మీద పాలసీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, షేర్లు, ఎమర్జన్సీ ఫండ్ కలిగి ఉండటం, డిజిటల్ పరిజ్ఞానం పొంది ఉండటం? అంటే ఆర్థిక లావాదేవీలు ఫోన్‌మీద, కంప్యూటర్ మీద చేయగలిగి వేగంగా పనులు నిర్వర్తించ గలగడం. కుటుంబ సౌభాగ్యమే దేశ సౌభాగ్యం అనుకుంటే కుటుంబంలో కీలకమైన వాటాదారైన స్త్రీ ఎంత ఆర్థిక సమృద్ధితో ఉంటే దేశ సమృద్ధి అంతగా పెరుగుతుంది. ఉమెన్స్ డే సందేశం అదే. స్త్రీలు సాధికారత ఎప్పుడు పొందుతారంటే ఆర్థికంగా వారు స్వేచ్ఛ పొందినప్పుడు. స్త్రీలకు సామాజికంగా, కుటుంబ పరంగా హక్కులు ఉంటాయి. అయితే ఆ హక్కులను దక్కించుకోవాలంటే వారికి ఆర్థిక ఆత్మవిశ్వాసం ఉండాలి. 'ఎవరో ఒక అయ్య చేతిలో పెట్టడానికి' అనుకునే తల్లిదండ్రులు, భర్త సంపాదన వల్ల మాత్రమే ఆమె బతకాలనుకునే తల్లిదండ్రులు ఆమె చదువును నిర్లక్ష్యం చేయడం గ్రామీణ భారతంలో నేటికీ జరుగుతూనే ఉంది. ఆడపిల్లకు ఆస్తిపాస్తులు ఇచ్చినా చదువు వల్ల వచ్చే, ఆమెకై ఎంచుకునే ఉపాధి నుంచి వచ్చే సంపాదన కలిగించే ఆత్మవిశ్వాసం వేరు. స్త్రీలను 'అదుపులో ఉంచడం' అంటే వారిని ఆర్థిక వనరుల నుంచి దూరంగా పెట్టడమే. కుటుంబపరంగా, సామాజికంగా తన జీవితం ఏ విధంగా గడవాలని స్త్రీ ఆశిస్తుందో ఆ నిర్ణయాన్ని వెల్లడించే శక్తి ఆర్థిక స్వావలంబన వల్ల కలుగుతుంది. స్త్రీలు సాధికారత పొందాలంటే వారి ఆకాంక్షలకు సమాజం ఆమోదం తెలపాల్సిందే. ఒక స్త్రీ అంటప్రెన్యూర్ కావాలను కున్నా, పెద్ద పెద్ద సంస్థల్లో నాయకత్వ స్థానానికి ఎదగాలనుకున్నా, కాన్పు సమయంలో బ్రేక్ తీసుకుని నాలుగైదేళ్ల తర్వాత తిరిగి తన ఉద్యోగం చేయాలని అనుకున్నా, పెళ్లి తర్వాత పై చదువులకు వెళ్లాలను కున్నా, గృహిణిగా ఉంటూ ఇంటిపట్టునే ఏదైనా పనిచేసి సంపాదించాలనుకున్నా వారికి అడ్డుగా నిలవకపోవడమే చేయవలసింది. ఒక అధ్యయనం ప్రకారం స్త్రీలు తమ సంపాదనలో 90 శాతం కుటుంబం కోసం ఖర్చు పెడతారు. పురుషులు నలభై,యాభై శాతం ఖర్చు పెడతారు. స్త్రీలు సాధికారత పొందడం అంటే తాము ఏం చేసినా పడి ఉంటుందనే భావన నుంచి పురుషులను బయట పడేయడం అని అర్థం చేసుకోవాలి.

# మహిళా అథ్లెట్లకు మరింత ప్రోత్సాం అవసరం

## క్రీడాకారులను ప్రోత్సహించే చర్యలు అవసరం

**న్యూఢిల్లీ, మార్చి 7 (ప్రజామంటలు):** భారత్ లాంటి విశాలమైన దేశంలో సవాళ్లు ఉన్నప్పటికీ, గ్రామాల స్థాయిలో క్రీడలకు సంబంధించి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే మహిళా అథ్లెట్లు మరింత మంది ముందు కొచ్చే అవకాశం ఉంటుంది. మెరుగైన శిక్షణ, పోషకాహారం లాంటి కారణాలతో ఇప్పటికీ దేశంలో క్రీడలు పట్టణ ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయని చాలామంది నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చెస్‌కు భారత్‌లో ఉండాల్సినంత ఆదరణ లేదని మహిళా చెస్ క్రీడాకారులు అభిప్రాయపడుతున్నారు. కామన్వెల్త్ గేమ్స్ తర్వాత దేశంలో క్రీడలకు సంబంధించి మౌలిక సదుపాయాలు చాలా మెరుగయ్యాయి. అయిన ప్పటికీ, అంతర్జాతీయ ప్రమాణాలతో పోల్చితే ఇంకా చాలా మెరుగవ్వాల్సి ఉంది. ఇప్పటికీ దేశంలో క్రికెట్‌దే ఆధిపత్యం. అయితే, క్రీడా అభిమానులు, మీడియా పురుషుల క్రికెట్ జట్టుకు ఇచ్చినంత ప్రాధాన్యత, మహిళల జట్టుకు ఇవ్వడంలేదు. క్రికెటర్లకు వచ్చినంత గుర్తింపు ప్రపంచ, ఏషియన్, కామన్వెల్త్ ఛాంపియన్లకు రావడంలేదు. ఖేలో ఇండియా గేమ్స్‌లో బాలికలు పతకాలు సాధిస్తున్నారు. షూటింగ్‌లో పలు అంతర్జాతీయ పతకాలు సాధించిన 17 ఏళ్ల రామ్ కిషన్ భాకెర్ తమకు పెద్దగా ప్రచారం రావడం లేదని అంటోంది. మాలావత్ పూర్ణ లాంటి వారెందరో పర్వతారోహణలో రాణించారు. దేశానికిపేరు తెచ్చారు. ఇలాంటి వారిని ప్రోత్సహించాలి. కొన్ని చిన్న గ్రామాల్లో ఆటల గురించి ఏమాత్రం అవగాహన ఉండదు. పోటీల గురించి కొంతమంది గ్రామీణులకు తెలియదు. కానీ, కాస్త దృష్టి పెడితే ఆ ఊళ్లలోనే మెరుగైన ఆటగాళ్లు దొరుకుతారు. మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి. అబ్బాయిల్లాగే తాము కూడా క్రీడల్లో రాణించగలమని పోరాడాలి. సాంస్కృతిక, సంప్రదాయ అవరోధాల ను అధిగమించాలి. మహిళలు స్వయం శక్తి దిశగా ఎదిగేలా పథకాలను కేంద్రం తీసుకుని రావాలి. అన్నిరంగాల్లో విజయాలు సాధిస్తున్న మహిళలు ప్రోత్సహిస్తే మరింతగా రాణించగలరు. సానియా మిర్జా, సైనా నెహ్వాల్, పివి సింధు,సాక్షి, మాలావత్ పూర్ణా ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో మనదేశంలో తమ పిల్లలు అడపిల్లలని చూడడం లేదు. వారిని వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు వెనకాడడం లేదు. ఎందరో ఆడపిల్లల తల్లిదండ్రుల తమ పిల్లలను అతి కష్టం మీద చదివిస్తున్నారు. వారికి వెన్నంటి నిలిచి ప్రోత్సహి స్తున్నారు. ఇలాంటి వారికి కేంద్రం ప్రోత్సాహకాలు ప్రకటించాలి. ఫీజులు, విద్యా రుణాలు,క్రీడాంశాల్లో రాయితీలు ఇవ్వాలి. ఇలాంటి తల్లిదండ్రలును ప్రోత్సహించేందుకు సింధు విజయాన్ని ఓ స్ఫూర్తిగా తీసుకోవాలి. అప్పుడే ప్రధాని మోడీ ఇచ్చిన బేటీ పడావోకు అర్థం ఉంటుంది. సింధు ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ స్ఫూర్తి పొందిన సింధు ఇంటి పక్కన చిన్నారులతో బ్యాడ్మింటన్ ఆడడం మొదలు పెట్టింది. ఆమె ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు దగ్గర్లోని రైల్వే శిక్షకుడి వద్ద చేర్పించారు. తర్వాత మెరుగైన శిక్షణ కోసం గోపీచంద్ అకాడమిలో చేర్పించారు. ఇలా కొన్నేళ్లుగా బ్యాడ్మింటన్ తర్ఫీదుని కొనసాగిస్తున్న సింధు ఎవరెస్ట్ శిఖరం లాంటి ఒలంపిక్స్ దశకు చేరుకుంది. ఒకవైపు ఆటల్లో.. మరోవైపు చదువులో రాణించడ మంటే కత్తిమీద సామే అయినా సింధు రెండింట్లోనూ సత్తా చాటింది. ఒలింపిక్స్‌లో కాంస్యం, ఎన్నో సూపర్ సిరీస్‌లు, మరెన్నో గ్రాండ్ ప్రీ టైటిళ్లు సొంతం చేసుకున్న సైనా నెహ్వాల్ భారత బ్యాడ్మింటన్ స్టార్. ప్రపంచ ఛాంపియన్ షిప్ కోసం సైనా పోరాడు తున్న రోజుల్లో రాకెట్‌లా దూసుకొచ్చిన సింధు... ఆ ఘనతను పోటీ పడ్డ తొలిసారే కైవసం చేసుకుంది. ఈ ప్రత్యేకతతో ఒక్కసారిగా భారత బ్యాడ్మింటన్‌కు పర్యాయపదంగా మారిన సైనా సరసన చేరింది. ఇలాంటి వారందరిని గుర్తించి వారికి ప్రభుత్వపరంగా ప్రోత్సాహం దక్కేలా చేయాలి.

# నేడే త్రికూటేశ్వర ఆలయంలో మహాశివ రాత్రి వేడుకలు

## "ప్రజామంటలు యూట్యూబ్ ఛానల్" లో శివరాత్రి వేడుకలు ప్రత్యక్ష ప్రసారం

## "ప్రజామంటలు యూట్యూబ్ ఛానల్" ను సబ్స్క్రైబ్ చేసుకోండి





**భీమదేవరపల్లి మార్చి 07 (ప్రజామంటలు):**
బ్రహ్మ సూత్రము గల శివలింగం ఉన్న ఆలయముగా పేరుగాంచిన ముత్తారం త్రికుటేశ్వర ఆలయంలో మహాశివరాత్రి జాతర నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు నిర్వాహకులు చేస్తున్నారు. మార్చి 7 నుండి 9 వరకు మూడు రోజులపాటు జరిగే మహాశివరాత్రి జాతర అత్యంత వైభవోపేతంగా జరుగుతుంది.

**కార్యక్రమ వివరాలు:**
శ్రీశ్రీశ్రీ రాజయోగి సిద్దేశ్వర మహారాజ్ మంగళ శాసనాలతో మహాశివరాత్రి ఉత్సవాలు మహాశివరాత్రి వేడుకలలో భాగంగా మార్చ్ 7, గురువారం రోజున సాయంకాలము 5 గం.లకు గణపతి పూజ అఖండ దీప ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభమౌతాయని ఆలయ అర్చకులు చక్రాచారి వెల్లడించారు. 8 న, శుక్రవారం ఉ. 6 గం.ల నుండి రుద్రాభిషేకం, బిల్వార్చన ప్రారంభమగును. ఉ. 10 గం.లకు గణపతి నవగ్రహ మహా మృత్యుంజయ హెూమము నిర్వహించబడును. సా.6 గం.లకు సహస్ర దీపాలంకరణ, రాత్రి 8:30 ని.లకు శివపార్వతుల కళ్యాణము నిర్వహించబడును. రాత్రి 12 గం.లకు లింగోద్భవ కాలంలో ప్రత్యేక అభిషేకములు జరిపించబడును. 9 న, శనివారం రోజు ఉదయం 10 గం.లకు పూర్ణాహుతి, ఆశీర్వచనము, తీర్థప్రసాద వితరణ జరిపించబడును. మ. 12: 30 ని.లకు మహా అన్నదాన కార్యక్రమం జరిపించబడును. తదనంతరము శ్రీశ్రీశ్రీ రాజయోగి సిద్ధేశ్వర మహారాజు మంగళశాసనములతో స్వామివారి రుద్రాక్ష భస్మము భక్తులకు అందజేయబడును.

**దాతల సహకారంతో అభివృద్ధి పనులు:**
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా త్రికూటేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులకు గాను హనుమకొండ వాస్తవ్యురాలు దోమకుంట్ల స్వరూపారాణి భక్తుల సౌకర్యార్థం 50 వేల రూపాయలతో మెట్ల వంతెనను చేయించారు. దోమ కుంట్ల హేమలత కుటుంబ సభ్యులు 35 వేల రూపాయలతో ఆలయంలోపల మార్బుల్స్ వేయించారు. ముత్తారం వాస్తవ్యులు ఏనుగు సునీత మాధవరెడ్డి 24 వేల రూపాయలతో నీటి సౌకర్యం కొరకు 10 లీటర్ల వాటర్ ట్యాంక్, పైపులైన్ పనులు చేయించారు. అదేవిధంగా చెల్పూర్ వాస్తవ్యులు డాక్టర్ జగదీశ్వర్ రావు ఆలయ ప్రాంగణంలో 45 ట్రిప్పుల మొరం పోయించారు. ఇతర దాతల సహకారంతో ప్రస్తుతం మహా శివరాత్రి వేడుకలకు ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది.

**"ప్రజామంటలు యూట్యూబ్ ఛానల్" లో మహాశివరాత్రి వేడుకలు ప్రత్యక్ష ప్రసారం**
కాకతీయుల కాలంలో నిర్మించబడి గత మూడు సంవత్సరాలుగా మహా జాతర నిర్వహించుచున్న త్రికూటేశ్వర ఆలయ వేడుకలను ప్రజా మంటలు జాతీయ తెలుగు దినపత్రిక, యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలను నిర్వహిస్తుంది. భక్తులు, పాఠకులు యూట్యూబ్ ఛానల్ ని సబ్స్క్రైబ్ చేసుకొని ప్రత్యక్ష ప్రసారాలను నేరుగా వీక్షించే అవకాశం కల్పిస్తున్నట్లు ప్రజామంటలు ప్రతినిధి కాశిరెడ్డి ఆదిరెడ్డి అన్నారు.








## ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు

**కోరుట్ల మార్చ్ 07 (ప్రజామంటలు):**
పట్టణం లోని గడి బురుజు వద్ద గల విశ్వ శాంతి హై స్కూల్లో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ బ్రహ్మన్న గారి శంకర్ శర్మ, చీటీ సత్యం రావులు మాట్లాడుతూ.... మహిళలను గౌరవించడం మన సాంప్రదాయం అని నారీ శక్తి లేనిదే సృష్టి లేదని తల్లిగా అక్కగా, చెల్లిగా అన్ని పాత్రలను పోషించగల శక్తి ఒక్క స్త్రీ మూర్తికే సాధ్యం అని మహిళా దినోత్సవం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలనడం హాస్యాస్పదం

### పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్



**కోరుట్ల మార్చ్ 07 (ప్రజామంటలు):**
ఎల్ఆర్ఎస్ ను రద్దు చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు కోరడం హాస్యాస్పదమని కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ అన్నారు గతంలో అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి పార్టీ ఎల్ఆర్ఎస్ స్కీంను తీసుకువచ్చి ప్రజలను ఆగం చేసి వేల కోట్ల రూపాయలు సామాన్య మధ్య తరగతి ప్రజల నుండి వసూలు చేసి ఇప్పుడు దానిని రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను కలసి వినతి పత్రాలు సమర్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ పై రుద్ది రాద్ధాంతం చేయటం సమంజసం కాదని నిజంగా బిఆర్ఎస్ నాయకులు చిత్తశుద్ధి ఉంటే ఎల్ఆర్ఎస్ ద్వారా ఎన్ని కోట్ల రూపాయలు వసూలు చేశారో ప్రజలకు వివరించి ప్రజలను క్షమాపణ కోరాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని అమలు చేసి తీరుతుందని దీనిని ప్రజలు గమనించాలని కోరారు కావాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని అలాంటి వారి మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని తప్పకుండా నెరవేరుస్తుందని పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం పని చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎంఏ నయిం, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం వేణుగోపాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆడెపు మధు, కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, సంగ లింగం, అన్వర్, లోకిని వెంకీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా జరిగిన 8వ రోజు ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు



**జగిత్యాల మార్చ్ 07 (ప్రజామంటలు):**
గురువారము ద్వితీయ సంవత్సర జనరల్ విద్యార్థులకు జరిగిన గణిత శాస్త్రము-బి, జంతు శాస్త్రము, చరిత్ర పరీక్షలో 4109 మంది విద్యార్థులకు 4052 మంది హాజరైనారు. 57 మంది విద్యార్థులు గైరాజర్ అయినారు. ఒకేషనల్ విభాగంలో 1254 విద్యార్థులకు గాను 1180 మంది విద్యార్థులు హాజరైనా రు. 74 మంది విద్యార్థులు గైరాజరైనారు. మొత్తం మీద 97.55 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనారు. ఈ రోజు ఫ్లయింగ్ స్క్వాడ్ లు, సిట్టింగ్ స్క్వాడ్ లు, డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ, మరియు పరీక్షల కన్వీనర్ కలిసి మొత్తం 19 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ మిగిలిన పరీక్షలలో విద్యార్థులు వారి పరీక్షా కేంద్రానికి ఉదయం 8:45 నిమిషముల కంటే ముందుగానే చేరుకుని వారికి కేటాయించిన సీట్లో కూర్చోవాలని పరీక్షల కన్వీనర్ బి. నారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు. మానసిక ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులు టెలి మానస్ 14416 నెంబర్ కు ఫోన్ చేసి వైద్య సహకారాన్ని పొందవలసిందిగా పరీక్షల కన్వీనర్ ప్రకటనలో తెలిపారు.

## కేసిఆర్ దోపిడీ పై విచారణ జరపాలి

### ఎన్ఆర్ఐ, జేఏసీ రఘువీర్ రెడ్డి

**హైదరాబాద్ మార్చ్ 07 (ప్రజామంటలు):**
తెలంగాణలో కేసిఆర్ పాలనకు చరమగీతం పాడిన ప్రజలకు ఎన్ ఆర్ ఐ జేఏసీ నాయకులు రఘువీర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. 3వ సారీ మోదీ అధికారంలోకి రావాలని కోరారు. ప్రతిపక్షం ఉండాలి కాబట్టి కాంగ్రెస్ పార్టీ 40 సీట్లతో సరిపెట్టుకోవాలని అన్నారు. కేటిఆర్ అధికారం కోల్పోయాకా ఏం మాట్లడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదని, కల్వకుంట్ల కుటుంబాన్ని శాశ్వతంగా రాజకీయంగా దూరం చెయ్యాలని కోరారు. కవిత కొత్త డ్రామా మొదలు పెట్టిందని, పూలే విగ్రహం పెట్టాలని డిమాండ్ చెయ్యడం సిగ్గుచేటన్నారు. అధికారంలో వుండగా గుర్తుకు రాలేదాని ప్రశ్నించారు. ఎన్ ఆర్ ఐ ల భూములు కూడా కబ్జాలు చేశారని, ప్రజాప్రతినిధులు ఎన్ ఆర్ ఐ లకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కేసిఆర్ కుటుంబ దోపిడీ పై విచారణ జరపాలని, కేటిఆర్, కవిత అక్రమ ఆస్తులపై విచారణ చెయ్యాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో దేశాన్ని అగ్రబాగాన నిలవాలంటే, మోదీని మూడవసారి ప్రధానిని చెయ్యాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచంలో భారత్ ను విశ్వగురు చేయాలంటే అది మోదీ వల్లనే సాధ్యమన్నారు. చైనా వంటి దురాక్రమణ దేశాన్ని ఎదుర్కోవాలంటే మోదీ వంటి సమర్థుడైన నాయకుడి వల్లే సాధ్యమన్నారు. రాహుల్ గాంధీ లాంటి వారు అధికారం లోకి వస్తే తీవ్రవాదం పెరిగి పోతుందని, ప్రజలు దేశ రక్షణ కోసం బిజెపికి అండదండలు అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ వంటి బలహీనమైన నాయకత్వం వల్ల దేశానికి భద్రత లేదని, భవిష్యత్తు కూడా ఉండబోదని విజ్ఞప్తి చేశారు. కుటుంబ వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలికి, దేశ భక్తులకు అధికారాన్ని కట్టబెట్టాలని రఘువీర్ రెడ్డి కోరారు.




## 'జీరో' విద్యుత్ బిల్ రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి

### విద్యుత్ శాఖ అధికారి



**ధర్మసాగర్ మార్చ్ 07 (ప్రజామంటలు):**
ధర్మసాగర్ మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన సేవాకేంద్రంలో గత మూడురోజులుగా 'జీరో' విద్యుత్ బిల్ రానివారు. జీరోబిల్లు కొరకై ఆధార్ కార్డు, రేషన్ కార్డు, అప్లై చేసిన ప్రజాపాలన దరఖాస్తు ఫామ్, గ్యాస్ బుక్, దరఖాస్తు దారిని మొబైల్ తీసుకొని వెళ్లి.మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవాకేంద్రంలో అప్లై చేసుకోవాల్సిందిగా తెలిపారు.ప్రజాపాలన కార్యక్రమంలో విద్యుత్ శాఖకు సంబంధించి ఏడు మండలాలకు చెందిన ఇన్చార్జి అధికారి మాట్లాడుతూ.... మండల కేంద్రంలో సేవా కేంద్రాలను పెంపొందించి త్వరితగతంగా అప్లికేషన్ చేసుకున్నవారికి జీరో బిల్ పొందే విధంగా అప్లికేషన్స్ ను పరిశీలించి అప్డేట్ చేస్తామని తెలిపారు. ఈ కేంద్రానికి వచ్చిన ఒక అప్లికేషన్ దరఖాస్తు దారుడు మాట్లాడుతూ.... మూడు రోజుల నుంచి తిరుగుతున్న అప్లికేషన్ అప్డేట్ చేయలేక పోతున్నారనితన ఆవేదన తెలియజేశారు. మండల కేంద్రానికి పలు గ్రామాల నుండి వస్తున్న అప్లికేషన్ దారులు ఎండ తీవ్రతకు గురవుతున్నామని ఇంటి వద్దకే వచ్చి అప్డేట్ చేస్తామన్న మాట తుంగలో తొక్కి గ్యాస్ అప్డేట్, కరెంట్ బిల్ అప్డేట్, కేవైసీ అప్డేట్ లంటూ సమయాన్ని వెల్లబుచ్చుతున్నారని తెలిపారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్





**జగిత్యాల మార్చ్ 07 (ప్రజామంటలు):**
వంటింటికి పరిమితం కాకుండా అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జగిత్యాల ఐఒడిసి సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా కలెక్టర్ షేక్ యాష్మీన్ భాష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గారు. జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ... మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పాలని సూచించారు. అదేవిధంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వివరించారు. నేటి సమాజంలో మహిళలతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో రాయికల్ జడ్పీటిసి అశ్విని, జిల్లా సంక్షేమ అధికారిణి వాణి, అధికారులు, వివిధ శాఖలలో మహిళా ఉద్యోగినీలు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్






**జగిత్యాల మార్చ్ 07 (ప్రజామంటలు):**
జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అడిషనల్ కలెక్టర్ దివాకర్ (స్థానిక సంస్థల) లను కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... జగిత్యాల పట్టణ అభివృద్ధిలో తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.



జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన జగిత్యాల స్టేషన్ ఎక్సైజ్ సిఐ గా నూతనంగా నియామకం అయిన సర్వేశ్వర్

## సర్దార్ పటేల్ కాలేజీలో విమెన్స్ డే సెలబ్రేషన్స్

**సికింద్రాబాద్ మార్చ్ 07 (ప్రజామంటలు):**
పద్మారావునగర్ లోని సర్దార్ పటేల్ డిగ్రీ, పీజీ కాలేజీలో ఎన్.ఎస్.ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్టూడెంట్స్ పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఎన్.హేమలత మాట్లాడుతూ...నేటి పోటీ కాలంలో మహిళలు తాము ఎందులోనూ తీసిపోమని నిరూపిస్తూ, అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. తమకు సమాన హక్కులు దక్కే వరకు పోరాటాలు చేయాల్సిందేనన్నారు. ఇవన్నీ కేవలం విద్య తోనే సాధ్యమవుతాయన్నారు. ప్రతి ఒక్కరు ఉన్నత చదువులు చదవాలన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ను కాలేజీ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.అమర్ నాథ్ శర్మ, ఎన్.ఎస్.ఎస్. ఆఫీసర్లు బాబు, రాజశేఖర్, మహిళా అధ్యాపకులు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాహుల్ , విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఉద్యమ నాయకునికి దక్కిన గౌరవం

### బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షునిగా పిట్టల మహేందర్





**ఎల్కతుర్తి మార్చ్ 07 (ప్రజామంటలు):**
హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వోడితల సతీష్ కుమార్ బిఆర్ఎస్ పార్టీ ఎల్కతుర్తి మండల అధ్యక్షునిగా పిట్టల మహేందర్ ను నియమించినట్లు తెలిపారు, ముఖ్య అతిథిగ హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ.... పార్టీ స్థాపించినప్పటి నుండి క్రియాశీలకంగా పనిచేసిన అనుభవం అందరితో కలిసి మెలిసి ఉండే మనస్తత్వం గల నాయకుడు అన్నారు రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ప్రతిష్టత కోసం విశ్వాసనీయతతో పనిచేస్తాడు అని ఆశిస్తూ మండల నాయకులతో కార్యకర్తలతో కలిసిమెలిసి అందరిలో ఒకరిల ఉంటూ పార్టీ కోసం కృషి చేస్తాడు అనే నమ్మకంతో మండల పార్టీ అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు కడారి రాజు, రైల్వే బోర్డు సభ్యులు యేల్తూరి స్వామి, రైతుబంధు సమితి మండల అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ శేషగిరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తంగేడ మహేందర్, రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు హియా భాస్కర్, రాష్ట్ర నాయకులు గొల్లె మహేందర్, మండల యూత్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండా ప్రతాప్ రెడ్డి, మదన్ మోహన్ రావు, దేవేందర్ రావు, లోకిని సూరయ్య, సాతూరి చంద్రమౌళి, బాబు,శివాజీ, సమ్మయ్య, ప్రభాకర్ రావు, రవీందర్, యూత్ నాయకులు, భాష బోయిన సురేష్ యాదవ్, రంజిత్ కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రికి అంతా సిద్ధం

### శ్రీ గట్టు మల్లికార్జున సాయి దేవస్థానం, ఈఓ నాగేశ్వరరావు

వేలేరు మార్చ్ 07 (ప్రజామంటలు): వేలేరు మండలం మల్లికుధుర్ల గ్రామం లోని శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అతి పురాతన శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవస్థానం ఒకటి. ఈ ఆలయంలో మహాశివరాత్రి నుండి ఉగాది వరకు ఉత్సవాలు జరుగుతాయి ఈ సందర్భంగా దేవాలయ కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వరరావు మాట్లాడుతూ.... భక్తులకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా త్రాగునీరు, చలువ పందిర్లు, రవాణా సౌకర్యం, లైటింగ్ ఏర్పాట్లు చేయడం జరిగిందని మరియు ముఖ్యులందరికీ దేవాలయ ఇన్విటేషన్లు అందజేయడం జరిగిందని ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సింగపురం ఇందిర, జంగా రాఘవరెడ్డి పాల్గొంటారని తెలిపారు.



# శ్రీ మడేలేశ్వరస్వామి ఆలయంలో ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు



**జగిత్యాల మార్చ్ 07 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ళ భావి వద్ద గల శ్రీ మడేలేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయము మూలమూర్తికి పంచామృతా భిషేకము, పుణ్యాహవాచనము, రక్షాబంధనము, శ్రీ శ్రీగణపతి పూజ, గౌరీ పూజ, నవగ్రహ ఆరాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సిరిసిల్ల పార్థసారథి శర్మ నేతృత్వంలో వైదిక క్రతువులు కొనసాగాయి. శ్రీ గణపతి హవనము, రుద్ర హవనం, శ్రీ సూక్త హవనము, మన్యుసూక్తవనము, స్థాపితదేవత హవనములు అంగరంగ వైభవంగా కొనసాగాయి. రజక సంఘం ఆలయ అధ్యక్షులు మతులాపురము శంకర్ దంపతులు వైదిక పూజల్లో పాల్గొన్నారు. వైదిక క్రతువులు సిరిసిల్ల రాధాకృష్ణ శర్మ, భాస్కర్ శర్మ, చంద్రశేఖర శర్మ, రాజేంద్ర శర్మ, కిరీటి శర్మ తదితరులు నిర్వహించారు. కార్యక్రమం అనంతరం మహా ఆశీర్వచనము తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. స్వామి వారి నామస్మరణతో ఆలయమంతా మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సాంప్రదాయబద్ధంగా, సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన శివపార్వతుల కళ్యాణ వేడుకలు



**జగిత్యాల మార్చ్ 07 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణములోని అరవింద్ నగర్ లో గల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం శివపార్వతుల కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తుల నుంచి కళ్యాణ వేడుకలు కొనసాగించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పురపాలక సంఘ అధ్యక్షురాలు ఆదువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొని పూజలు నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదము, కల్యాణ అక్షితలు, అన్న ప్రసాదం వితరణ చేశారు. భక్తులు విశేష సంఖ్య లో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి నేత్రానందభరితులయ్యారు.

# సీనియర్ సిటీజేన్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలు



**జగిత్యాల మార్చ్ 07 (ప్రజామంటలు):** మహిళా సాధికారతకు స్ఫూర్తియే మహిళా దినోత్సవం వేడుకలని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు.గురువారం తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా కార్యలయములో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలో విశిష్ట సేవలు అందించిన మహిళలను,ఉత్తమ కొడళ్లను,ఉత్తమ మహిళా ఉద్యోగినీలను 36 మందిని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ చేతుల మీదుగా పట్టు శాలువల్తో అవార్డులతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జ్యోతి మాట్లాడుతూ అన్నిరంగాల్లో పురుషులకు ధీటుగా మహిళలు దూసుకుపోతున్నప్పటికీ ఎక్కడో ఒక చోట వివక్షకు గురవుతున్నారని,దీనికి విరుగుడు లింగ సమానత్వమేనన్నారు. సీనియర్ సిటీజేన్స్ రాష్ట్ర కార్యదర్శి జిల్లాఅధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ.... ఎక్కడ మహిళలు పూజింప బడుతారో అక్కడ దేవతలు కోలువై ఉంటారన్నారు. మహిళా చట్టాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జీ.ఆర్. దేశాయ్, సీనియర్ సిటీజేన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, పి. హన్మంత రెడ్డి, ఎం.డి. యకూబ్, కోశాధికారి వెలుముల ప్రకాష్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి. ఆశోక్ రావు, టీబీసీ ఉపాధ్యక్షుడు సింగం భాస్కర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కస్తూరి శ్రీమంజరి, కార్యదర్శి గంగం జలజ, సీనియర్ సిటీజేన్స్ పట్టణ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది పి. సతీశ్ రాజ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి, వివిధ సంఘాల ప్రతినిధులు రాజ్ గోపాల్ చారి, విట్టల్, కండ్లే గంగాధర్, దుబ్బేశం, నారాయణ, నర్సయ్య, సుధాకర్, రామానందం, ఎం.డి. ఎక్బాల్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## త్రికూటేశ్వర ఆలయ దర్శనానికి రానున్న మంత్రి పొన్నం ప్రభాకర్

### గతంలో మాజీ ఎంపీగా ఆలయ దర్శనం, ప్రస్తుతం మంత్రి



**భీమదేవరపల్లి మార్చ్ 07 (ప్రజామంటలు):** కాకతీయుల కాలం నాటి ప్రసిద్ధ కట్టడం ముత్తారం త్రికూటేశ్వర ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతర వేడుకలకు బీసీ వెల్ఫేర్ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గతంలో శిథిలావస్థలో ఉన్న సమయంలో మాజీ ఎంపీగా ఉన్న పొన్నం ప్రభాకర్ మొదటిసారిగా ఆలయ దర్శనానికి వచ్చారు. తాము అధికారంలోకి వస్తే ఆలయ అభివృద్ధిలో భాగస్వామిని అవుతానని మాట ఇచ్చారు. ప్రస్తుతం మంత్రిగా ముత్తారం త్రికుటేశ్వర ఆలయానికి రావడం పట్ల భక్తులు, ఆలయ నిర్వహకులు ఆనందం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధికి మంత్రిగా సహకారం అందించి ఆలయ అభివృద్ధిలో భాగస్వామి కావాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

# ఉచిత చలివేంద్రం ప్రారంభం



**మల్లాపూర్ మార్చ్ 07 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో సుమన్ యూత్ , ఉయ్యాల సుకుమార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత చలివేంద్రాన్ని సుమన్ యూత్ సభ్యులు గురువారం ప్రారంభించారు. సుమన్ యూత్ నాయకులు మాట్లాడుతూ ఉయ్యాల సుకుమార్ అనేక సేవా కార్యక్రమాలు చేసేవారని తెలిపారు. ఆయన చిన్న వయసులోనే ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. ఆయన జ్ఞాపకార్థం మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటుచేసి కోరుట్ల నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో మినీ బస్టాండ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనేకమంది నిరుపేదలకు శీతాకాలంలో బట్టలు, దుప్పట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆకలితో అలమటించే వారికి పలు సందర్భాలలో అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఈ ఉచిత చలివేంద్రం లో 365 రోజులు ఉచితంగా ప్రయాణికులకు తాగునీరు అందించడం జరుగుతుందని అన్నారు. తమ యూత్ కు అన్ని విధాల సహకరిస్తున్న దాతలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుకుమార్ తండ్రి విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు ఉయ్యాల నరసయ్య, ప్రముఖ పాత్రికేయుడు బలిజ రాజారెడ్డి, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు ఉయ్యాల శోభన్, నాయకులు ఉయ్యాల శేఖర్ పాల్గొన్నారు.

## డాక్టరేట్ కు ఎంపికైన ఉద్యమనేత పేట భాస్కర్



**కోరుట్ల మార్చ్ 07 (ప్రజామంటలు):** జాతీయ స్థాయిలో సామాజిక ఉద్యమాలకు ఊపిరిగా నిలుస్తున్న కోరుట్ల పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు ప్రజాసంఘాల జేఏసీ,అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పేట భాస్కర్ కు గౌరవ డాక్టరేట్ అవార్డు వరించింది.గత ముప్పై రెండు సంవత్సరాల క్రితం అప్పటి కరీంనగర్ ఉమ్మడి జిల్లా బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ గా ప్రారంభమైన ప్రస్థానం అక్షర జ్ఞానమే ఆయుధ మంటు ప్రజాదండోర పత్రిక సంపాదకులుగా, సామాజిక, ప్రజా ఉద్యమాలతో పాటు తెలంగాణ ఉద్యమంలో సైతం ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ గా క్రియాశీలకంగా వ్యవరించారు. స్థానికంగా కోరుట్ల రెవెన్యూ డివిజన్ సాధించడంలో ప్రధాన భూమిక పోసించిన తీరు ప్రజల్లో చిరస్థాయిగా నిలుస్తోంది. ప్రస్తుతం రాజ్యాంగ రక్షణే లక్ష్యంగా ప్రజలను అప్రమత్తం చేస్తూ జాతీయ స్థాయిలో చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నందుకు గాను సోషల్ సర్వీస్ కేటాగిరిలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ నుండి ఈ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేశారు. యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ స్ఫూర్తి సర్వీసెస్ సోసైటీ ఇండియా ఎన్జీవో చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ ఆధ్వర్యంలో ఈనెల 24న హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్లో గల సిటీ కల్చర్ ఆడిటోరియంలో అతిరథమహారథుల సమక్షంలో ఈ అవార్డు ప్రధానం చేయనున్నారని పేట భాస్కర్ తెలిపారు.

# మార్చ్ 11 న "మెగా జాబ్ మేళా"

## విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



**మెట్ పల్లి మార్చ్ 07 (ప్రజామంటలు):** మెట్ పల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంల కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ ఆధ్వర్యంలో పత్రిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... కోరుట్ల నియోజకవర్గ యువతీ, యువకుల కోసం మెగా జాబ్ మేళా 11-03-2024 సమయం పొద్దున 10 గంటల నుంచి 4 గంటల వరకు వెంకట్ రెడ్డి గార్డెన్స్, మెట్‌పల్లి లో ఉంటుందని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అలాగే కార్యాలయంలో సంప్రదించి సలహాలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఇంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే వేసవి కాలం కోసం మరియు వ్యవసాయం కోసం రివ్యూ మీటింగు పెట్టలేదని రైతుబంధు పడలేదని ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరిన కాంగ్రెస్ నాయకులు వారు ఇప్పుడెలా ప్రవేశపెట్టారని ఎస్సారా్ ఎస్పీలో పది రోజులు మాత్రమే నీళ్లు నిల్వ ఉన్నదని ఇప్పుడున్న పరిస్థితుల్లో వ్యవసాయ పనులకు కచ్చితంగా నీరు అవసరమని సీఎం మాట్లాడుతూ.... ఏడాది కరువు అని అన్నారని అధిక వర్షం పడ్డాయని కెసిఆర్ ను బద్నామ్ చేయడమే కాంగ్రెస్ అని మూడు పిల్లేర్లు పగుళ్లు రాగానే బ్యారేజీ పనికిరాదని అంటున్నారని ఇంజనీర్లు సంప్రదించి రిపేర్ చేస్తే సరిపోతుందని మా పార్టీపై అపనిందలు వేస్తున్నారని దయచేసి రాజకీయాలు వద్దని ప్రజలకు వేసవిలో డ్రింకింగ్ వాటర్ అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రానావేణి సుజాత సత్యనారాయణ, వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖరరావు ఎంపీపీ మారు సాయిరెడ్డి కౌన్సిలర్స్ లంక గంగాధర్, బంగారు కాళ్ళ కిషోర్, ఎనుగందుల శ్రీనివాస్ గౌడ్, కొమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనం

## మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు ఘన సన్మానం



**ఇబ్రహీంపట్నం మార్చ్ 07 (ప్రజామంటలు):** ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గౌరవ తెలంగాణ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు ఘన సన్మానం గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనం కు తరలి రావాలి.

మండలంలోని గోదురు గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న సంక్షేమ సంఘం నేరెళ్ల సుభాష్ అధ్యక్షతన ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్, సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తేదీ.10-03-2024 ఆదివారం రోజున మధ్యాహ్నం 12 గంటల నుండి వి కన్వెన్షన్ బొమ్మకల్ బైపాస్ రోడ్డు కరీంనగర్ లో గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనానికి భారీ సంఖ్యలో గౌడ బంధువులు కదలి రావాలని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గం కన్వీనర్ గోల్లపల్లి రామా గౌడ్, గోధూర్ గౌడ సంఘం అధ్యక్షులు కట్ట లక్ష్మీనారాయణ గౌడ్, గౌడ సంఘ సభ్యులు చెట్ల జోగేశ్వర్ గౌడ్, భువనగాని సత్యం నారాయణ గౌడ్, కట్ట శ్రీనివాస్ గౌడ్, చెట్ల శోభన్ గౌడ్, చెట్ల రవి, తదితరులు పాల్గొన్నారు.


## మాజీ ఎమ్మెల్యే దాము 62వ జయంతి



**మెట్ పల్లి మార్చ్ 07 (ప్రజామంటలు):** మెట్ పల్లి మాజీ ఎమ్మెల్యే దాము 62 వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి వేడుకలు జరిపారు. అనంతరం ఆయన ఎమ్మెల్యేగా ఉండి పార్టీలకు అతీతంగా సేవా కార్యక్రమాల్లో అభివృద్ధి చేసిన వ్యక్తిగా మంచి పేరు సంపాదించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, చెట్లపెల్లి సుఖేందర్ గౌడ్, ఇల్లెందుల కృష్ణమాచారి, ధోనికెళ్ల నవీన్, నిర్మల్ శ్రీనివాస్, ఆర్కే గణేష్, బొడ్ల నరేష్, బండి రమేష్, ఓంకారి అంజయ్య, కలికోట శ్రీకాంత్, కొండ్లెపు శ్రీనివాస్, విజయ్, పుల్ల సౌజన్య, ఏంబీర్, జగన్, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

# పెద్దాపూర్ మల్లన్న స్వామి దేవస్థానం నూతన ఆలయ కమిటీ ఏర్పాటు

**మెట్ పల్లి మార్చ్ 07 (ప్రజామంటలు):** మెట్ పల్లి కోరుట్ల మండలం పెద్దాపూర్ మల్లన్న స్వామి దేవస్థానం నూతన ఆలయ కమిటీ ఏర్పాటు జరిగింది. కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగారావు అధ్యక్షతన మెట్పల్లి జెడ్పిటిసి కాటిపల్లి రాధా శ్రీనివాస్ రెడ్డి మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి పెద్దాపూర్ ఎక్స్ ఎంపిటిసి దొంతుల గంగయ్య ఎంపీటీసీ శంకరయ్య సమక్షంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. నూతన అధ్యక్షులుగా మిట్టుపల్లి నారాయణరెడ్డి. ఉపాధ్యక్షులు మెరుగు రమేష్ గౌడ్, పిల్లి మల్లేశం యాదవ్, ఖచ్చు శ్రీనివాస్,ధర్మకర్తలుగా బైరి సురేష్, తెలుగంటి స్వామి, గొర్రె నరసయ్యలు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగారు.వీరిని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నర్సింగరావు గారు గ్రామ పెద్దలు శాలువాతో పూలమాలతో సన్మానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పూజారి మహేష్ యాదవ్ తిప్పిరెడ్డి అంజి రెడ్డి, కాటిపల్లి లింగారెడ్డి, చేపూరి రాజారెడ్డి, రమేష్రెడ్డి, ఎం. రాజారెడ్డి పెద్దాపూర్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ జపాన్ బ్రౌన్ బెల్ట్ డిప్లొమా సాధించిన బండలింగాపూర్ నవీన్ కరాటే మాస్టర్



**మెట్ పల్లి మార్చ్ 07 (ప్రజామంటలు):** జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్ ఆధ్వర్యంలో దుర్గమ్మ ఆలయం ప్రాంగణం అత్తాపూర్ హైదరాబాద్ లో తేది.06.03.2024 బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ బ్లాక్ బెల్ట్ ప్రశంసా పత్రాల ప్రధానోత్సవ కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ లెజెండ్ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత నటుడు సుమన్ చేతుల మీదుగా జగిత్యాల జిల్లా బండలింగాపూర్ గ్రామానికి చెందిన కరాటే మాస్టర్ నవీన్ కు అంతర్జాతీయ జపాన్ బ్రౌన్ బెల్ట్ డిప్లొమా ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ ఈ రోజుల్లో విద్యార్థులు శారీరిక మానసిక వ్యక్తిత్వ వికాసానికి విద్యార్థుల ఎదుగుదలకు ఇలాంటి కరాటే ఆత్మరక్షణ విద్యలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ స్టేట్ జపాన్ కరాటే అసోసియేషన్ ఛైర్మన్ సినీ నటుడు సుమన్, జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ శ్రీనివాసచారీ, జిల్లా ప్రధాన శిక్షకులు ప్రవీణ్ కుమార్, కరాటే మాస్టర్లు నాగరాజు, విశ్వనాథ్, పవన్ కళ్యాణ్, నవీన్, కరాటే విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఏస్ఎస్ఎమ్ డిజి స్కూల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు



**జగిత్యాల మార్చ్ 07 (ప్రజామంటలు):** ఎస్ఎస్ఎస్.ఎం. డి.జి. స్కూల్ లో గురువారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న మహిళలను సత్కరించారు. విద్యార్థినిలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆహుతులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వయంకృషితో సాధించ లేనిది ఏదీ లేదని మహిళలు సాధికారతతో ముందుకు వెళ్ళినప్పుడే అభివృద్ధి చెందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినీలు డాక్టర్. పి. నవనీత, జంగిలి శైలజ, ఏ. హరిప్రియ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు స్ఫూర్తిదాయకమైన సందేశం అందించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు ఏ. రాజేందర్, బాబురావు, ప్రశాసకులు నేరెళ్ల శ్రీనివాస్ చారి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా గుండి సౌజన్యకు ఉత్తమ సేవా పురస్కారం అందించిన జిల్లా కలెక్టర్



**జగిత్యాల మార్చ్ 07 (ప్రజామంటలు):** మేడిపల్లి గురుకుల పాఠశా లలో విధులు నిర్వహిస్తున్న గుండి సౌజన్య ఉత్తమ సేవలకు గాను మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కొని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకుంది. ఈ సందర్భంగా జగిత్యాల అఖిల బ్రాహ్మణ సేవా సంఘం సభాపతి ,అధ్యక్షులు, సంఘ పెద్దలు గుండి సౌజన్యకు ఆశీ :పూర్వక శు భాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా మహిళా దినోత్సవం




**వేలేరు మార్చ్ 07 (ప్రజామంటలు):** వేలేరు మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి అధ్యక్షతన ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలులో ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి మాట్లాడుతూ.... మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలని విద్యార్థులు ఉన్నత సదులు చదివి మంచి ఉద్యోగాలు సాధించి అందరికి పూర్తిగా నిలవాలని అన్నారు. ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ.... 2024 వ లోక్ సభ ఎన్నికల్లో భాగంగా ఓటు లేని వారు ఓటు నమోదు చేసుకొని ప్రతి ఒక్కరు ఎన్నికల్లో ఓటు వేయాలని అన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలో ఫస్ట్ ప్రైజ్ వేలేర్ సెకండ్ ప్రైజ్ ఎర్రబెల్లి థర్డ్ ప్రైస్ లోకేష్ తండా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, ఎంపీఓ విమల మహిళలు పాల్గొన్నారు.

# ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల యాజమాన్య సంఘం

## ప్రధాన కార్యదర్శిగా యాద రామకృష్ణ ఏకగ్రీవం

### యాద రామకృష్ణకు అభినందన పరంపర




**జగిత్యాల మార్చ్ 07 (ప్రజామంటలు):** ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రి ,పి.జి. కళాశాలల యాజమాన్య సంఘం ఎన్నికలలో స్థానిక రామకృష్ణ, ఎన్.ఎస్.వి.డిగ్రి మరియు పి.జి.కళాశాలల చైర్మన్ యాద రామకృష్ణ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా స్థానిక నలంద డిగ్రి,పి.జి.కళాశాల చైర్మన్ శ్రీపాద నరేశ్,శ్రీ చైతన్య డిగ్రి కళాశాల చైర్మన్ ముసిపట్ల రాజేందర్,వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ మునీందర్, కొక్కుల రాజేందర్, వెంకట రమేశ్, మల్లికార్జున్, సురేశ్, లెక్చరర్లు మరియు కార్యాలయ సిబ్బంది యాద రామకృష్ణ ను ప్రశంసిస్తూ శాలువాలతో, గజమాలలతో జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి అభినందనల వర్షం కురిపించారు. తెలంగాణ ప్రైవేట్ డిగ్రి, పిజి. కళాశాలల యాజమాన్య సంఘానికి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణ మాట్లాడుతూ తన భుజ స్కంధాలపై ఉంచిన ఈ బాధ్యతకు కట్టుబడి ఉంటానని,వివిధ సమస్యల పరిష్కారానికి త్రికరణ శుద్ధితో శతవిధాలా నేను ప్రయత్నిస్తాననినొక్కి చెప్పారు. అభిమానించి, సన్మానిస్తూ అభినందనలను తెలియజేస్తూ తనపై పూర్తి నమ్మకాన్ని పెట్టుకున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

# నటులకు ఆత్మగౌరవం ముఖ్యం

## కంగనా పోస్ట్‌తో మరోమారు మంటలు



నిత్యం ఏదో ఓ వివాదంలో ఉండే కంగనా రనౌత్ మరోసారి వార్తల్లోకెక్కారు. ఈసారి ఇన్‌డైరెక్ట్‌గా తన ఇండస్ట్రీపైన, సెలబ్రిటీలపైనే సెటైర్లు వేసి బాలీవుడ్‌లో మంట లేపింది. ఇప్పుడు ఈ విషయం హిందీ పరిశ్రమతో పాటు సోషల్ మీడియాలోనూ హాట్ టాపిక్‌గా మారింది. ఏ విషయం మనసులో దాచుకోకుండా మోహం మీద కొట్టినట్లు చెప్పే ఈ ముద్దుగుమ్మ తాజాగా నటులకు ఆత్మగౌరవం ముఖ్యమంటూ ఓ పోస్టు పెట్టి అగ్గి రాజేసింది. విషయానికొస్తే.. ఈ మధ్య గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో అంబానీ ఇంట్లో అనంత్, రాధికల ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ మూడు రోజుల పాటు జరిగిన సంగతి తెలిసిందే. ఈ వేడుకలకుదే , విదేశాల నుంచి చాలా మంది పెద్ద ప్రముఖులు హాజరైన సంగతి తెలిసిందే. అదేవిధంగా బాలీవుడ్ నుంచి కూడా దాదాపు టాప్ స్టార్స్ హీరో హీరోయున్స్ అందరు పాల్గొనడమే కాక ఆడి పాడారు. ఆ వీడియోలు కూడా సామాజిక మాధ్యమాల్లో బాగానే వైరల్ అయ్యాయి. అయితే ఈ కార్యక్రమంలో బాలీవుడ్ క్వీన్‌గా పేరు సంపాదించుకున్న కాంట్రవర్సీ క్వీన్ కంగనా రనౌత్ పార్టిసిపేట్ చేయలేదు కానీ పరోక్షంగా ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారిపై కామెంట్లు చేసింది. దీంతో ఈ అంశం నార్త్‌లో బాగా చర్చనీయాంశం అవుతోంది. అసలు ఆమె సోషల్‌మీడియాలో పెట్టిన పోస్టు సారాంశం ఏంటంటే.. ప్రతి ఒక్కరికి డబ్బుకంటే ఆత్మగౌరవం ముఖ్యమని నేను నా సెల్ఫ్ రెస్పెక్ట్‌ను చంపుకోలేనంటూ గతంలో లతా మంగేష్కర్ ఓ ఇంటర్వ్యూలో చెప్పిన మాటలను కంగనా రనౌత్ గుర్తు చేసింది. గతంలో లతా మంగేష్కర్ గారు చెప్పిన మాటలను నేను ఇప్పటికీ తూచా తప్పకుండా పాటిస్తానని, అవతలి వారు ఎంత ధనవంతులైనా వారెంత డబ్బిచ్చినా పెళ్లిళ్లలో పాడనని చెప్పి తను మరణించేంత వరకు ఆ మాట మీదనే ఉందన్నారు. నేను పుట్టి ఈ స్థాయికి వచ్చేంత వరకు కూడా ఆర్థికంగా చాలా ఎదురు దెబ్బలు తిన్నప్పటికీ, అవతలి వాళ్లు కోట్లలో డబ్బు ఇస్తామని చాలా సార్లు ఆఫరిచ్చినా వేరే వాళ్ల వేడుకల్లో డ్యాన్సులు చేయలేదని, చివరకు ఐటమ్ సాంగ్స్ కూడా చేయలేదని కంగనా రనౌత్ స్పష్టం చేశారు.



# రామ్‌చరణ్ బర్త్‌డే కానుక

## 23న నాయక్ రీ రిలీజ్‌కు సన్నాహాలు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ బర్త్ డే కానుకగా ఆయన నటించిన సూపర్ డూపర్ హిట్ చిత్రం నాయక్ రీ రిలీజ్ కానుంది. రామ్ చరణ్ సరసన అందాల భామలు కాజల్ అగర్వాల్ అమలాపాల్ నటించిన ఈ చిత్రానికి వి.వి.వినాయక్ దర్శకత్వం వహించగా, డి.వి.వి.దానయ్య నిర్మించిన సంగతి తెలిసిందే. దాదాపు పన్నెండేళ్ల క్రితం వచ్చిన ఈ చిత్రం అభిమానులతో పాటు ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం రీ రిలీజ్ అయితే మళ్ళీ చూడాలని ప్రేక్షకాభిమానులు కోరుకుంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రముఖ నిర్మాత నట్టి కుమార్ ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సందర్భంగా నట్టి కుమార్ మాట్లాడుతూ, 'మార్చి 27న రామ్ చరణ్ బర్త్ డేని పురస్కరించుకుని, కాస్త ముందుగా మార్చి 23న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నాం. ఇందులో రామ్ చరణ్ తన పాత్రకు ప్రాణ ప్రతిష్ట చేశారు. హీరోయిన్లు కూడా పోటీ పడి నటించారు. మిగతా పాత్రధారులు కూడా తమ పాత్రలలో ఒదిగిపోయారు. చిత్రంలో అన్ని అంశాలు ఉన్నాయి. కామెడీకి కూడా పెద్ద పీట వేశారు. తమన్ సంగీతాన్ని అందించిన ప్రతీ పాట హైలైట్ గా ఉంటుంది. ఛోటా కె.నాయుడు సినిమాటోగ్రఫీ ఓ ఆకర్షణగా నిలుస్తుంది' అని అన్నారు.



# బాలకృష్ణకు సెట్‌లో కోపం ఎక్కువ

## దర్శకుడు రవికుమార్ వ్యాఖ్యలపై అభిమానుల ఆగ్రహం

నందమూరి బాలకృష్ణ, తమిళ దర్శకుడు కెఎస్ రవికుమార్ తో రెండు సినిమాలు వరసగా చేశారు. 2018లో 'జై సింహ' ఆ తరువాత మరుసటి సంవత్సరం అంటే 2019లో 'రూలర్' అనే సినిమాకి పనిచేశారు. ఇప్పుడు రవికుమార్ వార్తల్లో వున్నారు, ఎందుకంటే అతను బాలకృష్ణపై చేసిన కొన్ని వ్యాఖ్యలకు అభిమానులు రవికుమార్ పై ఫైర్ అవుతున్నారు. ఇంతకీ విషయం ఏమిటంటే రవికుమార్ 'గార్డియన్' అనే తమిళ సినిమా మీడియా సమావేశానికి హాజరయి అక్కడ బాలకృష్ణపై చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి, అందుకని బాలకృష్ణ అభిమానులు రవికుమార్ ట్రోల్ చేస్తున్నారు. ఇంతకీ రవికుమార్ బాలకృష్ణ గురించి ఏమ్మన్నారంటే 'షూటింగ్ సమయంలో ఎవరేనా నవ్వితే బాలకృష్ణకి కోపం వస్తుందని, వెంటనే ఆ నవ్విన వ్యక్తిని పిలిచి కొడతారని' చెప్పారు రవి కుమార్. అలా ఒకసారి బాలకృష్ణతో సినిమా చేస్తున్నప్పుడు తన సహాయ దర్శకుడు అయిన శరవణన్ ని ఫ్యాన్ తనవైపు తిప్పమన్నాను అని, అతను అనుకోకుండా ఆ ఫ్యాన్ బాలకృష్ణ వేపు తిప్పాడని, ఆ గాలికి బాలకృష్ణ విగ్ ఒక్కసారిగా కదిలిందని, అది చూసి సహాయ దర్శకుడు వెంటనే నవ్వాడని చెప్పారు రవికుమార్. అతను నవ్వటం చూసి బాలకృష్ణకి వెంటనే కోపం వచ్చిందని, 'ఎందుకు నవ్వుతున్నావ్' అని గట్టిగా అతనిపై అరిచారని, ఎక్కడ సహాయ దర్శకుడిని కొడతాడో అని నేను బాలకృష్ణ దగ్గరికి వెళ్లి సర్ది చెప్పాను అని రవికుమార్ చెప్పుకొచ్చారు. అయినా కూడా బాలకృష్ణ వినలేదు అని, ఆ సహాయ దర్శకుడిపై అరిచి అక్కడనుంచి వెళ్లిపొమ్మని చెప్పారని రవికుమార్ అప్పుడు జరిగిన సంఘటనలను చెపుతూ బాలకృష్ణ గురించి చెప్పుకొచ్చారు. బాలకృష్ణ అభిమానులు రవి కుమార్ చేసిన వ్యాఖ్యలని తప్పుపట్టారు. బాలకృష్ణ వ్యక్తిత్వం తెలిసినవాళ్ళు ఎవరూ అలా మాట్లాడరని, ఎందుకంటే రవికుమార్ కి సినిమాలు ఎవరూ ఇవ్వనటువంటి సమయంలో బాలకృష్ణ పిలిచి మరీ అతనితో రెండు సినిమాలకి దర్శకత్వం ఇప్పించారని, అటువంటి బాలకృష్ణపై రవికుమార్ ఆలా వ్యాఖ్యలు చెయ్యడం తగదని అభిమానులు అంటున్నారు. దర్శకుడు చెప్పినట్లు చేసే నటుడు బాలకృష్ణ అని చాలా సందర్భాల్లో చెప్పి, ఇప్పుడు ఇలా వ్యంగ్యంగా మాట్లాడటం వలన బాలకృష్ణ కంటే అతని అభిమానులమైన మాకు ఇంకా ఎక్కువ కోపం వస్తోందని, రవికుమార్ పై సామాజిక మాధ్యమాల్లో బాలకృష్ణ అభిమానులు విరుచుకుపడుతున్నారు.




## నేడు కన్నప్ప ఫస్ట్ లుక్ విడుదల


టాలీవుడ్ హీరో మంచు విష్ణు హీరోగా రూపొందుతోన్న తాజా సినిమా 'కన్నప్ప' దూర్జటి విరచిత 'శ్రీకాళహస్తీశ్వర మహత్యం' కావ్యం ఆధారంగా మంచు విష్ణు నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ న్యూజిలాండ్‌లో జరుగుతుంది. ఇక అత్యంత భారీ బ్జడెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే మోషన్ పోస్టర్ విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా మూవీ నుంచి మేకర్స్ 'కన్నప్ప' ఫస్ట్ లుక్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మహా శివరాత్రి కానుకగా.. మార్చి 08 మధ్యాహ్నం 2.55 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇక ఈ చిత్రంలో అగ్ర హీరో ప్రభాస్ శివుడి పాత్రలో నటించబోతున్నారు. ఈ విషయాన్ని మంచు విష్ణు అధికారికంగా వెల్లడించారు. కన్నప్ప మొదట నాస్తికుడు అన్న విషయం తెలిసిందే. ఆ తర్వాత శివుడికి భక్తుడిగా మారతాడు. ఇక అతడు శివుడి భక్తుడిగా ఎలా మారాడు అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. అయితే భక్త కన్నపస్స పేరుతో కృష్ణంరాజు గతంలోనే హిట్ సినిమా అందించారు.

# సుహాస్ ప్రసన్నవదనం




టాలీవుడ్ నటుడు సుహాస్ వరుస సినిమాలతో దూసుకు పోతున్నాడు. ఇప్పటికే అంబా జీపేట మ్యారేజీ బ్యాండు సినిమాతో హిట్ కొట్టిన ఈ హీరో మరో డిఫరెంట్ కాన్సె ప్ట్‌తో ముందుకు వస్తున్నాడు. సుహాస్ నటిస్తున్న తాజా చిత్రం 'ప్రసన్నవదనం'. ఈ సినిమాకు అర్జున్ వైకే దర్శకత్వం వహిస్తుండగా.. పాయల్ రాధాకృష్ణ, రాశీ సింగ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. లిటిల్ థాట్స్ సినిమాస్, అర్హ మీడియా బ్యానర్‌పై మణికంఠ ఏ÷సూ, ప్రసాద్ రెడ్డి ÷సుఖీ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేయగా ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం నుంచి మేకర్స్ టీజర్ విడుదల చేశారు. ఇక ఈ టీజర్ గమనిస్తే.. సుహాస్ ఈ సినిమాలో ఫేస్ బ్లైండ్‌నెస్ అనే వ్యాధితో బాధపడుతుంటాడు. ఈ వ్యాధి వచ్చిన వారు ఒక వ్యక్తికి సంబంధించి మొహం తప్ప అన్ని గురు పడతారు. అయితే ఈ వ్యాధి ఉన్న సుహాస్‌కు అనుకోకుండా ఒక సమస్య ఎదురవుతుంది. ఇక ఆ సమస్య నుంచి సుహాస్ ఎలా బయటపడ్డాడు అనేది సినిమా స్టోరీ. ఇంట్రెస్టింగ్‌గా సాగిన ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

# విమానంలో ప్రభాస్ ఫోటో తీసిన దిశాపటాని



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో వస్తున్న ఈ చిత్రానికి మహానటి సినిమా ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా భారతీయ పురాతన ఇతిహాసం మహాభారతం కాలం నుంచి ప్రారంభమై 2898 సంవత్సరంతో పూర్తయ్యే స్టోరీతో ఈ మూవీ రానుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే కల్కి టీం ప్రస్తుతం ఇటలీలో ఉన్నారు. ఇటలీలోని ఓ ఐలాండ్‌లో ప్రభాస్, దిశాపటానీపై వచ్చే రొమాంటిక్ సాంగ్ తెరకెక్కిస్తున్నారు. ఇక ఆ షూటింగ్ సెట్స్ నుంచి మూవీ టీం, టెక్నికల్ వర్కింగ్ ఫోటోలు కొన్ని వచ్చి ఇప్పటికే వైరల్ అయ్యాయి. తాజాగా చిత్రయూనిట్ మరో ఆసక్తికర ఫోటోని పోస్ట్ చేసింది. ఈ షూటింగ్‌లో భాగంగా..ఫ్లైట్‌లో వెళుతున్న ప్రభాస్‌ను దిశాపటానీ ఫొటో తీసింది. ఇక దిశా ఈ ఫొటో తీస్తున్న సమయంలో తీసిన ఫోటోని కల్కి టీం సోషల్ మీడియాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ స్టిల్ నెట్టింట ఫుల్ వైరల్‌గా మారింది.



# నేడు ప్రేములు చిత్రం విడుదల

మలయాళంలో చిన్న సినిమాగా విడుదలై బ్లాక్ బస్టర్ అయిన తాజా చిత్రం 'ప్రేమలు' ఫిబ్రవరి 9న విడుదలైన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో దూసుకెళుతుంది. ప్రముఖ మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ నిర్మించిన ఈ సినిమాను గిరీష్ ఏడీ దర్శకత్వం దర్శకత్వం వహించగా.. నస్లేన్, మమితా, అల్తాఫ్ సలీమ్, మీనాక్షి రవీంద్రన్, అఖిల భార్గవన్ ప్రధాన పాత్రలు పోషించారు. మలయాళంలో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ సినిమాను తెలుగులో 8న విడుదల చేస్తున్నారు.ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ తెలంగాణ బొమ్మలు సాంగ్ ఫుల్ వీడియోను విడుదల చేశారు. ఇక ఈ సాంగ్ చూస్తే.. మొత్తం హైదరాబాద్‌ని ఒక సాంగ్‌లో కవర్ చేశారని చెప్పుకోవచ్చు. ముఖ్యంగా ఈ పాటలో వచ్చిన చార్మినార్, గోల్కొండ కోట, ట్యాంక్‌బండ్, తెలంగాణ సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి సీన్స్ అయితే సాంగ్‌కు హైలెట్‌గా నిలిచాయి. ఇక ఈ సాంగ్ చూసిన ఓ నెటిజన్లు మా అందమైన హైదరాబాద్‌ను ఎంతో ఆందంగా చూపించినందుకు ధన్యవాదాలు. ప్రేమతో మీ తెలంగాణ పోరగాళ్లు అంటూ కామెంట్ చేస్తున్నారు. ఈ పాటకు సుహైల్ కోయా లిరిక్స్ అందించగా.. కె జి మార్కోస్, విష్ణు విజయ్ పాడారు. విష్ణు విజయ్ సంగీతం అందించాడు.

# విశ్వక్‌సేన్ గామి నేడు విడుదల



విశ్వక్ సేన్ హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం 'గామి' విద్యాధర్ కాగిత ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. చాందినీ చౌదరి కథానాయిక. మార్చి 8న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. అడివి శేష్, హనురాఘవపూడి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 'విద్యాధర్ కాగిత వంటి గొప్ప వ్యక్తిని నేను జీవితంలో చూడలేదు. తన మాటపై ఉన్న నమ్మకంతో ఈ సినిమా చేశాను. మంచి కథ కచ్చితంగా హిట్ అవుతుంది. ప్రేక్షకుల్ని కట్టిపడేసే సన్నివేశాలు ఇందులో ఉన్నాయి. శివరాత్రికి విడుదల చేయాలని అనుకోలేదు. ఇది దైవ నిర్ణయం. విభిన్నమైన కథతో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకుల మదిలో నిలిచిపోతుంది. మంచి సినిమా చూశామన్న ఫీలింగ్ అందరికీ కలుగుతుంది. ఎంతో రిస్క్ చేసి దీన్ని తెరకెక్కించాం. అందరూ గర్వపడే సినిమా ఇది. మా కష్టానికి తగిన ఫలితం దక్కుతుందనే నమ్మకం ఉంది. చాందినీ చౌదరి ఈ సినిమా కోసం కష్టపడింది. మార్చి 8న థియేటర్‌లో కలుద్దాం' అని విశ్వక్‌సేన్ అన్నారు. తాజాగా రాజమౌళి దీనిపై ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. కఠోరమైన కృషి ఉంటే అసాధ్యమైన కలలు సాకారమవుతాయి. 'గామి' గురించి దర్శకుడు, నిర్మాత ఎంత కష్టపడ్డారో నాతో చెప్పినప్పుడు ఈ మాట గుర్తొచ్చింది. ఇందులోని విజువల్స్ చూస్తే నాలుగేళ్ల నుంచి వాళ్లు ఎంత కష్టపడ్డారో అర్థమైంది' అంటూ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఈ చిత్రంపై అంచనాలు నెలకొన్నాయి.

# తొలిరోజు ముగిసిన ఆట.. 218 పరుగులకే ఆలౌటైన ఇంగ్లండ్



భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న చివరి టెస్ట్ మ్యాచ్ లో తొలి రోజు ముగిసింది. ఈ మ్యాచ్ లో తొలిరోజు టీమిండియా ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 135 పరుగులు చేసింది. క్రీజులో రోహిత్ శర్మ (52), శుభ్‌మన్ గిల్ (26) పరుగులతో ఉన్నారు. కాగా.. యశస్వి జైస్వాల్ 58 బంతుల్లో 57 పరుగులు చేసి పెవిలియన్‌కు బాటపట్టాడు. షోయబ్ బషీర్ బౌలింగ్ లో ఔటయ్యాడు. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి ఇంగ్లండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 57.4 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. భారత్ స్పిన్ బౌలర్ల దాటికి ఇంగ్లండ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. కుల్దీప్ యాదవ్, అశ్విన్ చెలరేగడంతో ఇంగ్లండ్ 218 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 5, అశ్విన్ 4 పడగొట్టారు. రవీంద్ర జడేజాకే ఒక వికెట్ దక్కింది. ఇక.. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో జాక్ క్రాలే (79) పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లు ఎవ్వరూ పెద్దగా రాణించలేకపోయారు. డకెట్ (27), పోప్ (11), రూట్ (26), బెయిర్‌స్టో (29), స్టోక్స్ డకౌట్, ఫోక్స్ (24), హార్ట్లీ (6), షోయబ్ బషీర్ (11), వుడ్ డకౌట్, ఆండర్సన్ డకౌటయ్యారు. ఇక.. ఈ మ్యాచ్ లో టీమిండియా రెండు మార్పులతో బరిలోకి దిగింది. రజత్ పాటిదార్ స్థానంలో దేవదత్ పడిక్కల్ కు అవకాశం లభించింది. మరో ఆటగాడు ఆకాశ్ దీప్ స్థానంలో బుమ్రా తిరిగి వచ్చాడు. ఇక.. ఇంగ్లండ్ జట్టు ఒక్క మార్పుతో బరిలోకి దిగింది. ఆలీ రాబిన్సన్ స్థానంలో మార్క్ వుడ్‌కి అవకాశం లభించింది. ఇదిలా ఉంటే.. భారత దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, ఇంగ్లండ్ మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ జానీ బెయిర్‌స్టోకు ఇది 100వ టెస్టు మ్యాచ్ కావడం గమనార్హం. ఇప్పటికే టీమిండియా 3–1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. అయితే సిరీస్ గెలిచిన తర్వాత కూడా ఈ టెస్టులో కూడా గెలవాలని భారత్ చూస్తోంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకోవాలంటే టీమిండియా ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాలి. మరోవైపు భారత్ పర్యటనను విజయంతో ముగించాలని ఇంగ్లండ్ జట్టు భావిస్తోంది. మరోవైపు టీమిండియా కెప్టెన్



రోహిత్ శర్మ రెండు మార్పులు చేశాడు. ఈ సిరీస్‌లో రెండో టెస్టుతో సుదీర్ఘ ఫార్మాట్లో అడుగుపెట్టిన రజత్ పటీదార్ అంచనాలను అందుకోలేకపోయాడు. ఆరు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 63 పరుగులే చేశాడు. దీంతో చివరి టెస్టుకు అతని స్థానంలో దేవ్‌దత్ పడిక్కల్‌ను తీసుకున్నారు. నాలుగో టెస్టుకు విశ్రాంతి తీసుకున్న స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చాడు. ఆర్ అశ్విన్, జానీ బెయిర్‌స్టోకు ఇది వందో టెస్టు మ్యాచ్. ఇప్పటికే సిరీస్ సొంతం చేసుకున్న భారత్.. చివరి మ్యాచ్‌నూ గెలిచి ఈ సిరీస్‌ను ఘనంగా ముగించాలని రోహిత్ బృందం భావిస్తోంది.

భారత్: యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ(కెప్టెన్), శుభమన్ గిల్, దేవదత్ పడిక్కల్, రవీంద్ర జడేజా, సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా

ఇంగ్లండ్: జాక్ క్రాలే, బెన్ డకెట్, ఒల్లీ పోప్, జో రూట్, బెన్ స్టోక్స్(కెప్టెన్), జానీ బెయిర్‌స్టో, బెన్ ఫోక్స్(వికెట్ కీపర్), టామ్ హార్ట్లీ, షోయబ్ బషీర్, మార్క్ వుడ్, జేమ్స్ ఆండర్సన్

# చప్పట్లతో అశ్విన్‌ను మైదానంలోకి ఆహ్వానం



టీమిండియా దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన కెరీర్?లో 100వ టెస్ట్ మ్యాచ్ ఆడుతున్నాడు. ఈ సందర్భంగా.. ఈరోజు మ్యాచ్?కు ముందు హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ అశ్విన్‌కు 100వ టెస్టు క్యాప్‌ను అందజేశాడు. అశ్విన్ తన 100 టెస్ట్ సందర్భంగా.. భార్య ప్రీతి నారాయణ్, తన ఇద్దరు కూతుళ్లు ధర్మశాలకు వచ్చారు. క్యాప్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు అశ్విన్‌కు తోటి ఆటగాళ్లు గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చారు. భారత ఆటగాళ్లు ఇరువైపు నిలుచుని చప్పట్లతో అశ్విన్‌ను మైదానంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా.. అశ్విన్ మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. తన విజయంలో కుటుంబం పాత్ర ఉందని చెప్పాడు. 'నాతో పాటు చెన్నయ్‌లో కూర్చొని ఉన్న ఓ వ్యక్తి కూడా ఇది భావోద్వేగ క్షణం. అంటూ తన తండ్రిని గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యాడు. చిన్నతనంలో నా క్రికెట్ కిట్ బైక్ పెట్రోల్ ట్యాంక్ మీద పెట్టి నన్ను ముందు కూర్చోబెట్టుకొని కోచింగ్‌కు తీసుకెళ్లేవాడు. మా అమ్మ, తాత సహకారంతోనే ఆయన నన్ను ఈ స్థాయికి తీసుకురాగలిగారని భావోద్వేగానికి గురయ్యాడు. అంతేకాకుండా.. నా భార్య ఈ రోజు వరకు నాకు మద్దతుగా ఉంది. నా ఇద్దరు పిల్లలు కూడా నా ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నారు.' అని అన్నాడు.ఈ సందర్భంగా.. అశ్విన్ తన అనుభవంతో యువ క్రికెటర్లకు కొన్ని సూచనలు చేశాడు. 'క్రికెట్‌లో ఐపీఎల్ పాపులర్ టోర్నీ. చాలా మంది యువకులు టీ20 క్రికెట్ ఆడి ఐపీఎల్‌లోకి రావాలనుకుంటున్నారు. అయితే, ఒక్కటి గుర్తు పెట్టుకోవాలి. టెస్ట్ క్రికెట్ జీవితం నేర్పని చాలా పాఠాలను నేర్పుతుంది. ఒత్తిడిని, ప్రతికూలతలను ఎలా అధిగమించాలనేది తెలుస్తాయి.' అని అన్నాడు. తాను టెస్టు క్రికెట్ అంటే ప్రాణంగా భావిస్తానని తెలిపాడు.

# ఐపీఎల్‌కు డీకే వీడ్కోలు పలకనున్న దినేశ్ కార్తిక్



టీమిండియా సీనియర్ వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ దినేశ్ కార్తిక్ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు డీకే వీడ్కోలు పలకనున్నట్లు సమాచారం. ఐపీఎల్ 2024 అతడికి చివరి టోర్నీ కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాదు అంతర్జాతీయ క్రికెట్‌కు కూడా దినేశ్ కార్తిక్ గుడ్‌బై చెప్పనున్నట్లు వార్తలు వస్తున్నాయి. 2022లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో డీకే ఆడాడు. ఆ టోర్నీలో విఫలమవడంతో దినేశ్ కార్తిక్ జట్టుకు దూరమయ్యాడు. 2008 ఎడిషన్ నుంచి దినేశ్ కార్తిక్ ఐపీఎల్‌లో ఆడుతున్నాడు. 16 సీజన్లలో ఇప్పటివరకు 242 మ్యాచ్‌లు ఆడిన డీకే.. 4516 పరుగులు చేశాడు. ఇందులో 20 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. కీపర్‌గా 141 క్యాచ్‌లు, 36 స్టంప్ ఔట్లు చేశాడు. ఐపీఎల్‌లో ఇప్పటివరకు ఆరు జట్లకు డీకే ప్రాతినిధ్యం వహించాడు. గతంలో ఢిల్లీ డేర్‌డెవిల్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్, ముంబై ఇండియన్స్, గుజరాత్ లయన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లకు ఆడాడు. ప్రస్తుతం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. మరోవైపు దినేశ్ కార్తిక్ 2004లో భారత్ తరఫున అరంగేట్రం చేశాడు. ఎంఎస్ ధోనీ వెలుగులోకి రావడంతో డీకే కనుమరుగయిపోయాడు. భారత్ తరఫున 26 టెస్టులు ఆడి 1025 పరుగులు చేశాడు. కీపర్‌గా 57 క్యాచ్‌లు, 6 స్టంపింగ్‌లు చేశాడు. చివరిసారిగా డీకే 2018లో టెస్టు మ్యాచ్ ఆడాడు. 94 వన్డే మ్యాచ్‌లు ఆడిన దినేశ్ కార్తిక్.. 1752 పరుగులు, 64 క్యాచ్‌లు అందుకున్నాడు. ఇక 60 టీ20లలో 686 రన్స్, 30 క్యాచ్‌లు పట్టాడు.

# జైస్వాల్ సరికొత్త రికార్డు



టీమ్ ఇండియా యువ ఓపెనింగ్ బ్యాట్స్?మెన్ యశస్వి జైస్వాల్ సంచలనం సృష్టించారు. తన కెరీర్‌లో మరో మైలురాయిని అధిగమించారు. ధర్మశాలలో జరిగే ఇంగ్లాండ్ %--% భారత్ మధ్య జరిగే ఐదవ టెస్ట్ సీరీస్ లో తొలిరోజు మంచి ఆటతీరును కనబరిచారు. దీంతో గొప్ప ఆటగాళ్ల జాబితాలో చోటు దక్కించుకున్నారు. గురువారం హెచ్‌పిసిఎ గ్రౌండ్‌లో జైస్వాల్ చేసిన అర్థ సెంచరీ 700 పరుగుల మార్క్ దాటింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో లెఫ్ట్ హ్యాండ్ ఆటగాడు హాఫ్ సెంచరీ చేసి 712 పరుగులకు చేరారు. భారత మాజీ కెప్టెన్, స్టార్ బ్యాట్స్ మెన్ విరాట్ కోహ్లీ కూడా హిమాచల్ ప్రదేశ్‌లోని స్టేడియంలో ఇలాంటి చరిత్రను కలిగి ఉన్నారు. 35 ఏళ్ల వయసులో 2016 సంవత్సరంలో ఇంగ్లాండుతో జరిగిన హోమ్ సిరీస్‌లో 655 పరుగులు చేశారు. లెజెండరీ డిపెండబుల్ రాహుల్ ద్రవిడ్ కూడా 2002లో ఇంగ్లాండు జట్టుపై విదేశీ గడ్డమీద 602 పరుగులు చేసి మూడో స్థానంలో నిలిచారు. ఇండియాలో ఇంగ్లండ్‌తో జరిగిన 1961–62 సిరీస్‌లో విజయ్ మంజ్రేకర్ చేసిన 586 పరుగుల మొత్తం ఒక ఇండియన్ క్రికెటర్ 1979లో చేసి రికార్డు సృష్టించారు. అప్పట్లో సునీల్ గవాస్కర్ 542 పరుగులు చేసి ఐదవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఇండియన్ టూర్‌లోని చివరి టెస్టులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్, భారత స్పిన్ బౌలర్ల ధాటికి తొలి రోజు మొత్తం పది వికెట్లను కోల్పోయింది. టీం మొత్తం 218 పరుగులకు ఆలౌట్ అయింది. ఇక సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన టీం ఇండియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ కోల్పోయి 135 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ 58 బంతుల్లో 57 పరుగులు చేసి అవుట్ అయ్యారు. అలాగే బెన్ డకెట్, జాక్ క్రాలే, ఆలీ పోప్, జానీ బెయిర్‌స్టోతో పాటు కెప్టెన్ బెన్ స్టోక్స్‌లతో సహా ఐదు విలువైన వికెట్లను కుల్దీప్ యాదవ్ తీసి ఇంగ్లాండ్ టీంను పెవీలియన్ బాట పట్టించారు. స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా 26 పరుగుల వద్ద వెటరన్ బ్యాటర్ జో రూట్‌ను క్రీజు నుంచి తొలగించడంతో ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నారు. అలాగే తన 100వ టెస్టు ఆడుతున్న రవిచంద్రన్ అశ్విన్.. టామ్ హార్ట్లీ, మార్క్ వుడ్, బెన్ ఫోక్స్, జేమ్స్ ఆండర్సన్‌లను ఔట్ చేయడంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో అత్యధిక స్కోరును చేయలేకపోయింది.

## రోహిత్ ఖాతాలో మరో రికార్డు..

భారత్ ఇంగ్లాండ్‌ల మధ్య జరుగుతోన్న 5వ టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా ఆధిపత్యం చూపిస్తోంది. భారత బౌలర్లు సమిష్టిగా రాణించంతో ఇంగ్లండ్ బ్యాటర్లకు తక్కువ పరుగులకే వెనుదిరిగారు. కేవలం 218 పరుగులకే ఇంగ్లండ్ అలౌట్ అయ్యింది. ఇదిలా ఉంటే ఈ మ్యాచ్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ మరో రికార్డును సొంతం చేసుకున్నాడు. కెప్టెన్‌గా 1000 పరుగులు చేసిన అతికొద్ది మందిలో ఒకరిగా పేరు దక్కించుకున్నాడు. 5వ టెస్ట్ మ్యాచ్‌లో 13 పరుగులు చేసిన రోహిత్ 1000 టెస్ట్ పరుగులు సాధించిన కెప్టెన్ల జాబితాలో చేరాడు. ఇక మూడు ఫార్మాట్‌లలో నాలుగంకెల సంఖ్యను చేరుకున్న ప్రపంచంలో 6వ ఆటగాడిగా నిలిచాడు. అంతకుముందు ఈ జాబితాలో ఎంఎస్ ధోని (భారత్), ఫాఫ్‌డుప్లెసిస్ (దక్షిణాఫ్రికా), కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్), విరాట్ కోహ్లి (భారత్), బాబర్ ఆజం (పాకిస్థాన్) ఉన్నారు. ఇదిలా ఉంటే ఇదే మ్యాచ్‌లో రోహిత్ శర్మ మరో రికార్డును సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలో 60కి పైగా క్యాచ్‌లు పట్టిన తొలి ప్లేయర్‌గా నిలిచాడు.

## మరోసారి జాక్ క్రాలీ దంచికొట్టాడు



ధనాధన్ ఇన్నింగ్స్ కుల్దీప్ అద్భుతమైన బంతితో ఎండ్

ధర్మశాల టెస్టులో మరోసారి జాక్ క్రాలీ దంచికొట్టాడు. ఈ సిరీస్ అంతటా ఇంగ్లాండ్ ఆటగాళ్లు విఫలమవుతూ వస్తున్నా.. ఆ జట్టు డాషింగ్ ఓపెనర్ జాక్ క్రాలీ మాత్రం వరుస అర్ధ సెంచరీలతో అదరగొడుతున్నాడు. చివరి టెస్టులోనూ మరో హాఫ్ సెంచరీతో కదంతొక్కాడు. ఈ టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఓపెనర్ జాక్ క్రాలీ మొదటి బంతి నుంచి విజృంభించాడు. 64 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్సర్‌తో అర్ధ సెంచరీ బాదేసిన క్రాలీ.. మొత్తంగా 108 బంతులు ఎదుర్కొని 79 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 1 సిక్స్ ఉంది. ఇతడి చేశాడు. దీంతో భారత్‌తో స్వదేశంలో ఒక టెస్టు సిరీస్‌లో నాలుగు హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు క్రాలీ. ఈ ఫీట్‌తో అతడు ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ మాథ్యూ హెడెన్ రికార్డును సమం చేశాడు. 2001లో హెడెన్ టీమిండియాపై నాలుగు అర్ధ సెంచరీలు కొట్టాడు. భారత్‌లో ఏ జట్టు పర్యటించినా.. ఏ ఒక్క ఆటగాడు ఇప్పటివరకు ఈ ఫీట్ అందుకోలేకపోయాడు. 2001 తర్వాత ఇప్పుడు సరిగ్గా 23 ఏళ్ళ తర్వాత భారత జట్టుపై నాలుగు హాఫ్ సెంచరీలు బాదిన క్రికెటర్‌గా క్రాలీ రికార్డుల్లోకి ఎక్కాడు. కాగా, ఐదో టెస్టులో టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్(5 వికెట్లు) దెబ్బకు ఇంగ్లాండ్ టాప్ ఆర్డర్ కుప్పకూలింది. 175 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం ఇంగ్లీష్ ప్లేయర్లు ఫోక్స్, హార్ట్లీ క్రీజులో ఉన్నారు. ఇంగ్లాండ్ 6 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది.




EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com